ఆంధ్రజ్యోతి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం 15 అక్టోబరు 2024

పంట కాలువల్లో పూడికతీతకు రూ.29 కోట్లు

నెల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పంట కాలువలను బాగు చేసేందుకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. వ్యవసాయ సీజన్ దగ్గర పడుతుండడంతో ఈ ఏడాదైనా పూడిక తీస్తారా.. లేదా..? అన్న ఆందోళనలో రైతాంగం ఉండగా ఈ లోపే రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న ఖరీఫ్ సీజన్‌కు పంట కాలువల్లో పూడిక తీసేందుకు ప్రభుత్వం నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్‌కు రూ.29 కోట్లు మంజూరు చేసింది. వీటితో కాలువల్లో పూడిక, గుర్రపుడెక్కాకును తొలగించనున్నారు. అలానే తెలుగుగంగ ప్రాజెక్టుకు మరో రూ.4 కోట్లు, సోమశిల ప్రాజెక్టుకు రూ.14 కోట్లు కేటాయించింది. వైసీపీ ప్రభుత్వంలో గడిచిన మూడు సీజన్లుగా కాలువల్లో పూడిక తీయకుండానే నెట్టుకొచ్చారు. ఎక్కడైనా సీజన్ ప్రారంభానికి ముందు కాలువలను బాగు చేస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వంలో మాత్రం సీజన్ మొదలయ్యాక కాలువల్లో పూడిక తీసినట్లుగా చూపించి బిల్లులు చేసుకున్నారు. ఈ అవినీతిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అదే సమయంలో రైతాంగానికి ఇబ్బంది లేకుండా సీజన్ కన్నా ముందుగానే పనులు చేసేందుకు నిధులు మంజూరు చేసింది. ఒకటి, రెండు రోజుల్లో ఈ పనులకు టెండర్లు ఆహ్వానించనున్నారు. ఈ నెలాఖరులోపు ఎలాగైనా పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే నెల నుంచి పంటల సాగు ప్రారంభం కానుంది.

'పల్లె పండుగ'కు వర్షం దెబ్బ


జలదంకి మండలం జమ్మలపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు

నెల్లూరు జడ్పీ, (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో మౌళిక సదుపాయల కల్పనకు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లెపండుగ కార్యక్రమం తొలిరోజే మూడు నియోజకవర్గాలకే పరిమితమైంది. తుఫాన్ ప్రభావం, పనుల ప్రతిపాదనలను కొంతమంది ఎమ్మెల్యేలు ఖరారు చేయకపోవటం తదితర కారణాలు. కావలి, ఆత్మకూరు మినహా మిగతా నియోజవర్గాల నుంచి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందాయి. దీంతో తొలిరోజు నెల్లూరు రూరల్, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో మాత్రమే ఈ కార్యక్రమం ప్రారంభమైంది. కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో నిర్వహించే అవకాశం లేకుండా పోయింది.



'సోమశిల' అభివృద్ధికి ప్రణాళిక

ఎత్తయిన కొండలు, పచ్చని చెట్లు, గలగల పారే పెన్నమ్మ నెలవైన సోమశిల త్వరలో మరెన్నో అందాలతో ఆహ్లాద, పర్యాటక ప్రాంతంగా మారనుంది. ఇందుకోసం కూటమి ప్రభుత్వ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తోంది. ఎకోటూరిజం ద్వారా సుమారు రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు జరగనున్నాయి. అనుకున్నస్థాయిలో అన్నీ పూర్తయితే 'సోమశిల'కు పర్యాటకుల సంఖ్య పెరగడంతోపాటు స్థానిక యువతకూ ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.

6



డ్రైవర్ నిద్రమత్తు.. ఇద్దర్ని బలిగొంది!

మనుమరాలి పెళ్లి చూశానన్న ఆనందం ఆ వృద్ధురాలిలో ఎంతోసేపు నిలవలేదు. సోమవారం తెల్లవారుజామున వలేటివారిపాళెం మండలం కొండారెడ్డిపాళెం వద్ద డ్రైవర్ నిద్రమత్తుతో కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు మహిళలు మృతి చెందగా, ఐదుగురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి.

6

అర్జీదారుడి సంతృప్తే ముఖ్యం

- 'గ్రీవెన్స్' సమస్యలన్నీ పరిష్కరించాల్సిందే!
- ఉచిత ఇసుక పాలసీ పటిష్టంగా అమలు
- చివరి దశకు ఫ్రీహోల్డ్ భూములపై విచారణ
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ ఆనంద్

6లో..



'ప్రజల సమస్యలు పరిష్కరించడమే నా ప్రధాన కర్తవ్యం. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో వస్తున్న ప్రతి అర్జీని పరిశీలిస్తున్నాం. అర్జీదారుడి సంతృప్తి చెందేలా వాటిని పరిష్కరిస్తున్నాం. కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద సమస్యలు మినహా మిగిలిన అర్జీల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ఒక అర్జీదారుడు మళ్లీ మళ్లీ వస్తుంటే అలాంటి కేసులను నేనే స్వయంగా చూస్తున్నా. పరిష్కరించగలిగిన సమస్యలను కూడా పరిష్కరించలేకపోతున్న అధికారులపై చర్యలకు ఉపక్రమిస్తున్నాం. అంతిమంగా సమస్యను పరిష్కరించి, ఫిర్యాదిదారుడు సంతృప్తి చెందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అని కలెక్టర్ ఓ ఆనంద్ వెల్లడించారు. జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.



రోజంతా వర్షం!

- గ్రామీణ, పట్టణ రోడ్లన్నీ జలమయం
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- లోతట్టు ప్రాంతాలపై దృష్టి : కలెక్టర్
- నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు
- సమస్యను నా దృష్టికి తేవాలి : మంత్రి నారాయణ
- కలెక్టర్‌తో చర్చించిన మంత్రి ఆనం

నేడు కూడా కురిసే అవకాశం

నెల్లూరు నగరంపై కమ్ముకున్న మేఘం


నెల్లూరు : అరవిందనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద..

జిల్లా వర్షపాతం 95.4 మిమీ

జిల్లాలో సగటు వర్షపాతం 95.4 మి.మీగా నమోదైంది. అత్యధికంగా జలదంకిలో 169.4మిమీ వర్షపాతం నమోదవగా, అత్యల్పంగా సీతారామపురంలో 38.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

మండలం	మి.మీ
అనంతసాగరం	107.2
జలదంకి	169.4
సంగం	126
కావలి	133.6
అల్లూరు	153.6
ఉలవపాడు	94.8
కలువాయి	91.2
చేజర్ల	94.2
బోగోలు	132.4
ఆత్మకూరు	79
గుడ్లూరు	87.2
కందుకూరు	112.2
దగదర్తి	107.8
లింగసముద్రం	74.2
కొడవలూరు	140.6
ఏఎస్‌పేట	84.4
వలేటివారి పాళెం	822
కలిగిరి	109.4
కొండాపురం	68.0
బుచ్చిరెడ్డిపాలెం	116.0
విడవలూరు	168.6
దుత్తలూరు	61.6
ఉదయగిరి	67.6
నెల్లూరు రూరల్	89.8
మర్రిపాడు	63.8
సీతారాంపురం	38.4
వరికుంటపాడు	43.6
వెంకటాచలం	90.8
వింజమూరు	75.6
కోవూరు	113.8
పొదలకూరు	74.2
ఇందుకూరుపేట	90.8
టీపీ గూడూరు	87.0
నెల్లూరు అర్బన్	100.4
మనుబోలు	54.6
ముత్తుకూరు	102.0
రాపూరు	54.6
సైదాపురం	59.0

నెల్లూరు హరనాథపురం (ఆంధ్రజ్యోతి) : ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. మంగళవారం కూడా జిల్లాలో పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ, అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. కొన్నిచోట్ల పిడుగుల పడే అవశాశం ఉందని తెలిపింది. సోమవారం కురిసిన వర్షానికి జిల్లాలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. నెల్లూరు నగరంలోని మురుగునీటి కాలువలు పొంగి ప్రవహిస్తున్నా యి. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు రావటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్, ఎంజీబీ మాల్ వద్ద రోడ్డుపై నీరు నిల్వ చేరింది. వైఎస్ఆర్ నగర్‌లో వర్షపునీరు వచ్చి చేరింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ఇందిరమ్మకాలనీ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. గిరిజన కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరింది. కనుపర్తిపాడు వద్ద మేజర్ డ్రైయిన్స్‌లో ఉన్న వ్యర్థాలను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. పొదలకూరు ప్రధాన రహదారి ప్రాంతంలో చెట్టు కూలింది. మొత్తం మీద జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.

● లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టాం : కలెక్టర్

జిల్లాలోని లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టామని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సముద్రంలోకి వేటకు వెళ్లిన 161 బోట్లను వెనక్కు రప్పించామని తెలిపారు. 650 మంది మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు రప్పించామని చెప్పారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 146 పునరావాస కేంద్రాలను పరిశీలించినట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి 9 మండలాల్లోని 42 గ్రామాల్లో ఈ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. సోమశిల, కండలేరు జలాశయాలకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. సోమశిలకు వరద పెరిగితే ముంపునకు గురయ్యే 127 గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తం చేశామని చెప్పారు. పెన్నా కరకట్టలక రక్షణకు ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. వెంకటగిరిలో ఒకటి, నెల్లూరులో ఒక ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కాగా సోమవారం సాయంత్రం కలెక్టర్ ఆనంద్ ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కావలి ఆర్డీవో మురళీకృష్ణ కలెక్టర్‌తో మాట్లాడుతూ కావలి, కొడవలూరులోని కొన్ని ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని వివరించారు.


చెరువు కాదు... అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వర్షపునీరు


బిట్రగుంట : ఒడ్డుకు చేరిన పడవలు

● నేడు కూడా సెలవు

కాగా అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు, కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటించామని కలెక్టర్ పేర్కొన్నారు. కాగా మంగళవారం కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు.

● సమస్యను నా దృష్టికి తేవాలి : మంత్రి నారాయణ

వర్షాలకు ఏ సమస్య వచ్చినా ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకుని రావాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని క్యాంపు కార్యాలయం నుంచి ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఎస్పీతోపాటు మున్సిపల్ వ్యవస్థ, విపత్తు నిర్వహణశాఖ అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల వల్ల గండ్లు పడే కాలువలు, గట్లను గుర్తించి పర్యవేక్షించాలన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. తాను 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

● కలెక్టర్‌తో చర్చించిన మంత్రి ఆనం

భారీ వర్షాల ప్రభావం, తీసుకున్న జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో సోమవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్నీ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలలో ఉంచేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మంత్రి ఆనం సూచనలతో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్ర మత్తం చేస్తున్నట్లు ఆర్డీవో పావని తెలిపారు.


కావలి : నీటమునిగిన ముసునూరు గిరిజనకాలనీ

● అప్రమత్తంగా ఉండండి

భారీవర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఎక్కడా ముప్పు వాటిల్లకుండా అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకో వాలని కోరారు. చెరువులు, కాలువలను పర్యవేక్షించా లన్నారు.

ఉత్కంఠ.. ఉద్వేగం!

- ఎట్టకేలకు వైన్‌షాపుల ఖరారు
- లైసెన్సు ఫీజు ద్వారా ప్రభుత్వానికి రూ.115.7 కోట్ల ఆదాయం
- 182 మద్యంషాపులకు లైసెన్సులు
- మహిళలను వరించిన 24 దుకాణాలు
- కలెక్టర్, జేసీల ఆధ్వర్యంలో లాటరీ
- సిండికేట్‌లో నష్టపోయినవారు ఎక్కువే
- రేపటి నుంచి మద్యం ప్రైవేటు అమ్మకాలు

నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో సోమవారం ఉదయం 8 గంటలకు కలెక్టర్ ఓ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ మద్యం షాపుల కేటాయింపునకు లాటరీ తీశారు. విజేతలు అయిన జిల్లాలోని 182 షాపుల వ్యాపారులకు లైసెన్సులు అందజేశారు. ఈ షాపుల లైసెన్సు ఫీజు ద్వారా ప్రభుత్వానికి రూ.115.70 కోట్ల ఆదాయం సమకూరింది. కాగా, ఈ లాటరీలో 24 దుకాణాలు మహిళలకు దక్కాయి. విజేతలుగా నిలిచిన వారు ఆనందంతో కేకలు, ఈలలు వేయగా, నష్టపోయిన వారు తల వంచుకొని దెబ్బ పడిందిరా అనుకుంటూ బయటకు వెళ్లిపోయారు. మొత్తం మీద లాటరీ ప్రక్రియ ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిసింది.



లక్కీడ్రాలో విజేతను ప్రకటిస్తున్న కలెక్టర్

నెల్లూరు క్రైం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: వైన్‌షాపుల లాటరీ ప్రక్రియకు ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కళాక్షేత్రంలోని వేదికపై రెండు టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొదటి టేబుల్‌లో ఎస్ఎల్ఆర్-1 షాపు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ లాటరీ ప్రక్రియను ప్రారంభించగా, రెండో టేబుల్‌లో ఎస్ఎల్ఆర్-95 షాపు నుంచి జేసీ లాటరీ ప్రారంభించారు. ఎక్సైజ్ సిబ్బంది ఒక్కో షాపునకు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు మైక్‌ద్వారా ప్రకటించి, వారికి కేటాయించిన టోకెన్ నెంబర్లను చూపించి వాటిని ఓ డబ్బాలో వేశారు.అనంతరం మూత వేసి బాగా కలియతిప్పి కలెక్టర్ వద్ద పెట్టగా, ఆయన టోకెన్‌ను తీసి మైక్‌లో విజేత పేరు ప్రకటించారు. ఆ తర్వాత మరో రెండు టోకెన్లకు లాటరీ తీశారు. ఇలా 182 షాపులకు లాటరీ నిర్వహించి విజేతలుగా నిలిచిన వ్యాపారులను ప్రకటించారు. మొదటి టోకెన్ తీసిన వ్యాపారులు షాపు తీసుకునేందుకు ఆసక్తి చూపక పోయినా, సోమవారం సాయంత్రానికి లైసెన్సు ఫీజు చెల్లించక పోయినా తర్వాత తీసిన నెంబర్లకు షాపులు కేటాయించేందుకు మూడు నెంబర్లను లాటరీలో తీశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.10 గంటల వరకు కలెక్టర్, జేసీ దగ్గరుండి లాటరీ తీసి విజేతలను ప్రకటించారు. షాపులు పొందిన వారు కళాక్షేత్రంలోనే ఏర్పాటు చేసిన బ్యాంకు కౌంటర్‌లో లైసెన్సు ఫీజు చెల్లించి లైసెన్సు పొందారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంతంగా వైన్‌షాపుల లాటరీ ముగిసిందని, ఈనెల 16వ తేదీ నుంచి వ్యాపారులు వైన్‌షాపులను ప్రారంభించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డీసీ టీ శ్రీనివాసరావు, ఏసీ పీ దయాసాగర్, ఈఎస్ ఏ శ్రీనివాసనాయుడు, ఏఈఎస్‌లు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

● సిండికేట్లతో నష్టపోయాం..

గతంలో వైన్‌షాపులు, బార్లకు టెండర్లు పడుతున్నాయంటే ఏళ్ల తరబడి మద్యం వ్యాపారంలో పాతుకుపోయిన వ్యాపారులు సిండికేట్‌లుగా మారేవారు. అయితే ఈ ఏడాది మాత్రం పాత వ్యాపారులు వైన్‌షాపులకు దరఖాస్తులు వేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. కొత్తగా వేలమంది వ్యాపారులు దరఖాస్తు చేశారు. వీరిలో అత్యధికులు అధికార పార్టీ నాయకులకు దగ్గరగా ఉండే నాయకులు, కార్యకర్తలే. అధికార పార్టీ నేతల పర్యవేక్షణలో 10 నుంచి 12 మంది కలిసి సిండికేట్‌గా మారి పలు వైన్‌షాపులకు 100కుపైగా దరఖాస్తులు వేసినట్లు సమాచారం. అయితే ఒక్క నియోజక వర్గం నుంచి మూడు నాలుగు సిండికేట్లు ఏర్పడటంతో వందల దరఖాస్తులు చేసుకున్నా, సిండికేట్‌లుగా మారిన వారికి మూడు నుంచి ఐదులోపే దుకాణాలు వచ్చినట్లు తెలిసింది. వందలాది దరఖాస్తులు వేస్తే ఒక్క షాపే వస్తే దాన్ని ఎవరు... ఎలా పంచుకోవాలి అబ్బా..? భారీగానే నష్టపోయామని వ్యాపారులు చర్చించుకుంటూ కన్పించారు.


మా పరిస్థితి ఏమిటో..!?


నగదు లెక్కేసుకుంటున్న వ్యాపారులు

● లైసైన్సుదారులకు ఫోన్లు

జిల్లా వ్యాప్తంగా సిండికేట్‌లో లేకుండా లైసెన్సులు పొందిన వ్యాపారులకు సిండికేట్ల నుంచి ఫోన్‌లు వచ్చాయని పలువురు వ్యాపారులు తెలిపారు. సమావేశానికి రావాలని మీ లైసెన్సులో కొందరికి భాగం ఇవ్వాలంటూ వారిని కోరినట్లు సమాచారం. భాగం ఇవ్వకపోతే వ్యాపారాలు చేసుకోవడం కష్టమని, ఆ ప్రాంతానికి చెందినవారు ఆ షాపులో భాగస్తుడిగా ఉంటే ఎలాంటి ఇబ్బందులు, గొడవలు ఉండవని సున్నితంగా హెచ్చరించినట్లు పలువురు వ్యాపారులు చెబుతున్నారు. కొంతమంది అయితే లాటరీలో మొదట గెలుపొందిన వ్యాపారులను 'మీరు షాపు వదిలేయాలని, అందుకు ఎంత కావాలో చెబితే ఇచ్చేస్తామని, రెండో టోకెన్ మాది ఉందని, మేము షాపు లైసెన్సు పొందుతామని బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. ఏది ఏమైనా నాయకుల అండ లేకుండా వ్యాపారం చేయలేమని పలువురు వ్యాపారులు భాగాలకు ఒప్పుకున్నట్లు సమాచారం.

● పురుషులకు పోటీగా మహిళలు

రాష్ట్రంలోనే సారా వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించిన మహిళలు పుట్టిన జిల్లా ఇది. అయితే కాలం మారే కొద్దీ పురుషులకు తాము ఎందులోనూ తక్కువ కాదంటూ వైన్‌షాపులకు దరఖాస్తు చేయడంలో మహిళలు కూడా పోటీ పడ్డారు. తక్కువ సంఖ్యలో వారు దరఖాస్తులు వేసినా అదృష్టం మాత్రం ఎక్కువుగా వారినే వరించింది. జిల్లా వ్యాప్తంగా 24 వైన్‌షాపులను వారు దక్కించుకున్నారు.

న్యూస్ బాక్స్



'సోమశిల' అభివృద్ధికి ప్రణాళిక

- రూ.600కోట్ల పనులకు ప్రతిపాదన

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: 'సోమశిల' అందాలను పెంచేలా కూటమి ప్రభుత్వం ఎకో టూరిజం దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం రూ.600 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేసేలా అధికార యంత్రాగం ప్రణాళికలు వేస్తోంది. ఇది కార్యరూపం దాల్చితే పనులు త్వరలో ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయి. టూరిజం అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల ప్రకటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఈ పనులను త్వరలో ప్రారంభిస్తారని వెల్లడించారు. ఆశించినస్థాయిలో అభివృద్ధి పనులు జరిగితే స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఎకో టూరిజంలో ద్వారా ప్రాజెక్టుకు ఇరువైపులా ఉన్న పచ్చని కొండలను మరింత అభివృద్ధి చేయనున్నారు. ఖాళీ ప్రదేశాల్లో ఉద్యానవనాలు, అతిథి గృహాలు, వన్యప్రాణుల కేంద్రాలు, రీసార్ట్ పనులు జరుగుతాయని అధికారులు చెబుతున్నారు. ఇక బోటు షికారు ఏర్పాటుతో సోమశిల నుంచి ఎగువన కడప జిల్లా సిద్ధవటం వరకు అందాలు పెంచి.. అవి తిలకించేలా నీటి ప్రవాహం లో వెళ్తూ కొండలు, కోనలు వీక్షించేలా పనుల రూపకల్పన జరగనున్నాయి. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకొన్న యువత ఎకో టూరిజం అభివృద్ధిపై ఆశలు పెంచుకుంటోంది.

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ కోచింగ్

నెల్లూరు హరనాథపురం (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ పరీక్షకు సిద్ధపడుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడునెలలు ఉచిత బోధన, భోజన వసతి కల్పిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమాధికారి బీ శ్రీనివాసులు ఓ ప్రక టనలో పేర్కొన్నారు. అర్హత గల వారు ఈనెల 21లోగా దరఖాస్తు చేసుకోవాల న్నారు. ఎస్జీటీ పరీక్షకు ఇంటర్‌తోపా టు, డైట్, టెట్ అర్హత ఉండాలని, స్కూల్ అసిస్టెంట్ పరీక్షకు డిగ్రీ, బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థుల వార్షికాదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలని, ఆశావహులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.

26న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు జడ్పీ (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమా వేశాన్ని ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు జడ్పీ ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జడ్పీ 7 స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతాయని తెలిపారు. గృహనిర్మాణ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, నీటి పారుదల, పంచా యతీరాజ్, పంచాయతీ శాఖ, నెడ్‌కాప్, ఉపాధి కల్పన, పరిశ్రమలు, వ్యవసాయ, అటవీ, విద్యా, వైద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖలతోపాటు పౌర సరఫరాలు, సాం ఘిక సంక్షేమ శాఖ, షెడ్యూల్డు కులాల సహకార సంఘాలకు సంబంధించి స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో సమీక్ష జరుగుతుందన్నారు.

వేంకటేశ్వరుడికి స్నపన తిరుమంజనం



నెల్లూరు సాంస్కృతికం (ఆంధ్రజ్యోతి) : మాగుంట లేఅవుట్‌లో ఉన్న ప్రసన్న వేంక టేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో సోమవారం నవకలశ తిరుమంజనం జరిగింది. అనంతరం నిత్యహోమం, స్వామి వారికి పవిత్ర అలంకరణ, విశేష పూజలు జరిగాయి.

నయా ట్రెండ్!



నారీలోకం.. సాధనలో మమేకం!

- మగువల్లో ఫిట్‌నెస్ మంత్రం
- మంచి ఆరోగ్యం, శరీరాకృతి కోసం పట్టు
- రోజుకు కనీసం గంటసేపయినా వ్యాయామం తప్పనిసరి
- కళకళలాడుతున్న జిమ్ కేంద్రాలు

'బమ్ చిక్ బమ్ చిక్.. చెయ్‌బాగా..
ఒంటికి యోగా మంచిదేగా..
రోజీగా ఒళ్లు పెంచుకోక.
నాజూగ్గా ఉండు తీగలాగా..!'

ఎప్పుడో విన్నట్టుంది కదా ఈ పాట. అవును.. ఈ గేయానికి తగ్గట్టుగానే నేటి నారీమణులు ఫిట్‌నెస్ కోసం జిమ్‌ల బాట పడుతున్నారు. అమ్మాయిలతోపాటు ఉద్యోగినులు, గృహిణులు కూడా మరింత అందంగా కనిపించేందుకు గంటల తరబడి వ్యాయామం చేస్తున్నారు. ఎంత బిజీగా ఉన్నా జిమ్ కోసం సమయం కేటాయించే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. దీనికితోడు ఏ సమయంలోనైనా జిమ్ చేసుకునే వెసులుబాటు ఉండటంతో ఆ కేంద్రాలు నిత్యం కలకళలాడుతున్నాయి.

- నెల్లూరు విద్య, (ఆంధ్రజ్యోతి)

నేటి ఆధునిక జీవనంలో ఉరుకులు, పరుగులతో శారీరక, మానసిక ఒత్తిడిని దూరం చేసుకునేందుకు వ్యాయామం తప్పనిసరి అయ్యింది. సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఫిట్‌నెస్ పెంచుకునేందుకు నేటి యువ తరం జిమ్‌లబాట పడుతోంది. కాస్త టైం దొరికితే చాలు రోజూ ఉదయం, సాయంత్రం కసరత్తు చేస్తూ శరీరాకృతిని పెంచుకుంటు న్నారు. ఇటీవల కాలంలో జిల్లా కేంద్రంతోపా టు పట్టణ, మండల కేంద్రాల్లోనూ జిమ్‌లు వెలుస్తుండటంతో అన్నీ రద్దీగా కనిపిస్తున్నా యి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వ్యాయామంతోపాటు రన్నింగ్ ఇతర వ్యాయా మాలు చేసి కొలువులు సాధించిన వారు ఎందరో ఉన్నారు. బాడీఫిట్‌నెస్ అంటే యువకులకే అనుకుంటే పొరపాటే.. తామేమీ తక్కువ కాదంటూ అమ్మాయిలూ పోటీ పడుతున్నారు. మహిళలకు ప్రత్యేకంగా జిమ్‌లు లేకపోవడంతో కంబైండ్ జిమ్‌లకే వెళుతున్నారు. అమ్మాయిలైతే ఎంటర్‌టైన్ మెంట్‌ను జోడించి కసరత్తు చేస్తున్నారు. పాటకు తగ్గట్టుగా ఏరోబిక్స్ చేస్తూ అలసట లేకుండా వ్యాయామం చేస్తున్నారు. బాడీబిల్డిం గ్, సిక్స్‌ప్యాక్, కసరత్తులు చేయడం వంటివి అబ్బాయిలకు మాత్రమే కాదని తమకు కూడా అవసరమేనంటున్నారు అమ్మాయిలు.

● వ్యాయామం తప్పనిసరి

సన్నగా ఉన్నా.. లావుగా ఉన్నా ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామం కోసం కేటా యించాలని నిర్ణయించుకుని క్రమం తప్పకుం డా జిమ్‌లకు వెళుతున్నారు. విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణు లైనా సరే తమకు వీలైన సమయాన్ని కేటాయిం చుకుని వ్యాయామం చేయడం అలవర్చుకుంటున్నారు. స్లిమ్‌గా ఉండ టం పలు అవకాశాలకు క్వాలిఫికేషన్‌గా గుర్తించి మరీ సాధన చేస్తున్నా రు. ఒత్తిడితోపాటు బీపీ, షుగర్, కీళ్లనొప్పులు, తల, నడుం నొప్పుల వంటి వ్యాధుల నుంచి ఉపశమనానికి వ్యాయామమే కరెక్ట్‌గా భావించి, కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. డాక్టర్లు కూడా వీటికే ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పడంతో జిమ్‌లకు వెళ్లే మహిళల సంఖ్య అధికమైంది.

● ఫీజులు ఇలా..

నెల్లూరులో జిమ్‌లకు వెళ్లే వారి కోసం ఆయా నిర్వాహకులు పలు రకాల ఫీజు వసూలు చేస్తున్నారు. నెలకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ఫీజు ఉంటుంది. అలాగే ఏడాదికి ఒకేసారి చెల్లిస్తే రూ.10వేల నుంచి రూ.15వేల వరకు తీసుకుంటున్నారు. దీంతోపాటు జిమ్‌లో ప్రత్యేక శిక్షణ అందించేందుకు పర్సనల్ ట్రైనింగ్ (పీటీ) కూడా అందు బాటులో ఉంటుంది. వీరికి ఒకరికి నెలకు రూ.2వేల నుంచి 3వేల వరకు ఫీజు తీసుకుంటారు. శరీరాకృతిని మార్చుకునేందుకు, సిక్స్‌ప్యాక్ పొందేందుకు, ఏ రోజు ఏ శిక్షణ పొందాలో పీటీలు దగ్గరుండి నేర్పిస్తారు. జిమ్‌లో చేరేవారు వారి అవసరాలకు అనుగుణంగా ఫీజులు చెల్లించి శరీర సౌష్టవాన్ని పెంచుకుంటున్నారు. వ్యాయామం చేసే వారి సంఖ్య పెరుగుతుండటంతో జిమ్‌ల సంఖ్య కూడా పెరుగుతున్నాయి.

నిత్యం వ్యాయామం చేయాల్సిందే!



మహిళల్లో అధికశాతం మంది ఆరోగ్యంపట్ల చైతన్యం పెంచుకున్నారు. నిత్యం వ్యా యామాలు చేయడం, ఆరోగ్య సూత్రాలను పాటిస్తున్నారు. నేను కొన్నేళ్లుగా ఫిట్‌నెస్‌పై శ్రద్ధ చూపుతూ నాతోటివారిలో కూడా అవగాహన కలిగిస్తున్నా ను. 80 శాతం మంచి న్యూట్రీషియన్ ఆహారం, 20శాతం ఫిజికల్ ఎక్సర్‌సైజులు చేస్తే అందంగా ఉండటంతోపాటు ఎటువంటి ఆరోగ్య సమస్యలు దరిచేరవు.

- మమత

అందంతోపాటు ఆరోగ్యం



గత ఏడాది నుంచి జిమ్‌లో ఎక్సర్‌సైజులు చేస్తున్నాను. దీనివల్ల అందంతో పాటు ఆరోగ్యం కూడా పెరుగుతుంది. శారీరకంగా, మానసికంగా ఎంతో ధ్రుడంగా ఉంటాము. శరీరాకృతిని మనకు అనుకూ లంగా మలచుకోవచ్చు. ఎటు వంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండకపోవడంతో నిత్యం ఓ గంట సేపు జిమ్‌కు కేటాయిస్తున్నా.

- శ్రావ్య

బరువు తగ్గేందుకు..



శరీరంలోని అధిక బరువును తగ్గించుకోవడంతో పాటు శరీరాకృతిని అందంగా మలచు కోవచ్చు. గత నాలుగు నెలల నుంచి సాధన చేస్తున్నాను. మొదట్లో 75 కేజీల బరువుతో జిమ్‌లో చేరిన నేను ప్రస్తుతం 15 కేజీలు తగ్గి 60 కేజీలతో ఆరోగ్యంగా ఉన్నాను. మరింత తగ్గేందుకు సాధన చేస్తున్నా.

- చరిష్మా

ఫిట్‌నెస్ ఎంతో అవసరం



ఫిట్‌నెస్ అనేది కేవలం కొందరికే పరిమితం కాదు. అన్ని వర్గాలవారికి ఎంతో అవసరం. ప్రతిరోజూ కనీసం ఒక గంటసేపు అయినా ఎక్సర్‌సైజులు చేయాలి. దీనివల్ల ఆరోగ్య సమస్యలు దరిచేరవు. జిమ్‌లో ప్రధానంగా జనరల్ ఫిట్‌నెస్, ఫిగర్ కంట్రోల్, వెయిట్ రిడక్షన్, ఏరోబిక్స్ చేయిస్తాము. కంబైండ్ జిమ్‌తోపాటు మహిళలకు ప్రత్యేక సమయాన్ని కూడా అందిస్తున్నాము.

- జిమ్ వంశీ, పల్స్ 72 జిమ్ అండ్ ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకుడు



అర్జీదారుడి సంతృప్తే ముఖ్యం

- 'గ్రీవెన్స్' సమస్యలన్నీ పరిష్కరించాల్సిందే!
- లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు
- ఉచిత ఇసుక పాలసీ పటిష్టంగా అమలు
- డిమాండ్ తగ్గించేందుకు బుకింగ్‌లు పెంచుతాం
- 'కండలేరు' భూములన్నీ ఆన్‌లైన్ చేస్తున్నాం
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ ఆనంద్

ముఖాముఖి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఉచిత ఇసుక పాలసీని జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తున్నాం. కొత్త పాలసీ కాబట్టి ఆరంభంలో చిన్నచిన్న సమస్యలు ఎదురైనా వాటిని అధిగమించాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా బుకింగ్‌లో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. దళారుల ప్రమేయం లేకుండా ప్రజలు నేరుగా యార్డుల నుంచే ఇసుకను తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు అన్ని అవకాశాలు కల్పించాం. ట్రాన్స్‌పోర్టర్లు ఎక్కువ ధరకు విక్రయించకుండా వారిపైనా నిఘా ఉంచాం. యార్డుల్లో ఇసుకను అక్రమంగా తరలించకుండా నిరంతరం సీసీ కెమెరాల నిఘాతో పర్యవేక్షిస్తున్నాం. తరచూ ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తున్నాం. మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించి యార్డుల్లో విక్రయాలు జరుపుతున్నాం. జిల్లా అవసరాలకు తగ్గట్లుగా రోజూ బుకింగ్‌లు ఇస్తున్నాం. అయితే ప్రకాశం జిల్లాకు కూడా మన దగ్గర నుంచే ఇసుకను తీసుకెళుతుండడంతో కొంత డిమాండ్ ఏర్పడుతోందన్న ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లాలో డిమాండ్‌ను తగ్గించేందుకు బుకింగ్‌లు పెంచుతాం. ప్రస్తుతం రోజుకు 6 వేల టన్నుల వరకూ విక్రయాలు జరుపుతుండగా, దాన్ని 9 వేలకు పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. ఓపెన్ రీచ్‌లలో కూడా ఇసుక తవ్వకాలకు టెండర్లు పిలిచాం. వీలైనంత త్వరగా ఈ రీచ్‌లను కూడా అందు బాటులోకి తెస్తాం. ఇసుక డెలివరీ తర్వాత ఆడిటింగ్ నిర్వహిస్తున్నాం. నిజంగానే ఆ వ్యక్తికి ఇసుక అవసర మా!? యార్డు నుంచి తెచ్చిన ఇసుక అక్కడ ఉందా!? ఆ ఇసుకతో నిర్మాణం జరిపారా!? లేదా!? అన్న వివరాలను సచివాలయ సిబ్బంది ద్వారా విచారిస్తాం. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా బుకింగ్‌లు చేసి ఆ ఇసుకను మార్కెట్లో అమ్మినట్లు తేలితే చర్యలు తప్పవు.

● చివరి దశకు ఫ్రీహోల్డ్ విచారణ

జిల్లాలో ఫ్రీహోల్డ్ భూములపై జరుగుతున్న విచారణ చివరి దశకు చేరుకుంది. ఫ్రీహోల్డ్ భూములతోపాటు అసైన్‌మెంట్ భూములపై కూడా విచారణ జరుగుతోంది. ఇది పూర్తి కాగానే ఆ నివేదికలను ప్రభుత్వానికి అంది స్తాం. ఆ తదుపరి నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయి. కండ లేరు ముంపు ప్రాంతాల నుంచి పరిహారం కోసం అనేక అర్జీలు వస్తున్నాయి. వీటిపై చాలా కాలంగా వివా దాలు కొనసాగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నా యి. ఈ నేపథ్యంలో ఈ వివాదాలను తగ్గించేందుకు కండలేరు ప్రాజెక్టుకు అప్పగించిన భూములన్నింటినీ ఆన్‌లైన్ చేయా లని ఇరిగేషన్ అధికారులను ఆదేశించాం. వెబ్ ల్యాండ్ రికార్డుల్లో కండలేరు ప్రాజెక్టు పేరు చేర్చితే చాలా వరకూ భవిష్యత్‌లో సమస్యలు తగ్గుతాయి. కలెక్టరేట్‌లో ఇక అన్ని ఫైళ్లను ఈ-ఫైల్ ద్వారానే నడపాలని ఆదేశా లిచ్చాం. ఫలితంగా వేగంగా ఫైళ్లు కదులుతాయి. అలానే ఏ సెక్షన్‌లో ఎన్ని ఫైళ్లు పెండింగ్ ఉన్నాయన్న వివరాలు కూడా ఇవ్వా లని సూచించాం. ఈ ఫైళ్లన్నింటినీ ప్రయారిటీ బేస్‌లో క్లియ ర్ చేయడానికి కృషి చేస్తాం. గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీలన్నీ త్వర గా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. అలసత్వం వహించిన అధికారులపై కఠినంగా వ్యవహరిస్తున్నా' అని కలెక్టర్ వివరించారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



'రాళ్లపాడు'లో 8.7 అడుగులకు చేరిన నీటిమట్టం

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభా వంతో కురుస్తున్న వర్షాలకు రాళ్లపాడు ప్రాజె క్టులో సోమవారం సాయంత్రం 8.7 అడుగులకు నీటి మట్టం చేరింది. ప్రాజెక్టు ఎగువ భాగాన కురుస్తున్న వర్షాలకు, సోమశిల నుంచి వస్తున్న 70 క్యూసెక్కుల నీటితో కలిపి ప్రాజెక్టులోకి 130 క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు ఏఈ జి.చంద్రమౌళి తెలిపారు. ఈ వర్షాలకు ముందు ప్రాజెక్టులో 7.6 అడుగుల నీరు ఉన్నట్లు చెప్పారు. రాత్రికి ప్రాజెక్టు నీటి ప్రవాహాన్ని బట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

● 'సోమశిల' పెరుగుతున్న ఇన్‌ఫ్లో

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : కడప, అన్నమ య్య జిల్లాలతోపాటు పెన్నా పరివాహక ప్రాంతా లలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఎగువ నుంచి వచ్చే ప్రవాహం పెరుగుతుండగా ఇంజనీర్లు అప్ర మత్తమయ్యారు. వరద రాకపై నెల్లూరులో కలెక్టర్ ఆనంద్ ఎస్ఈ వెంకటరమణారెడ్డితో చర్చించి పలు సూచనలు చేశారు. ఈమేరకు లోతట్టు గ్రామాల ప్రజలను రెవెన్యూ, పంచాయతీ అధికారులు అప్ర మత్తం చేశారు. పెన్నానది, వాగులు వంకల వద్దకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. సోమశిలకు ఇన్‌ఫ్లో సోమవారం ఉదయానికి 7,982 క్యూసెక్కులు నమోదవగా మధ్యాహ్నం నుంచి రెండు గంటలకోసారి అధికారులు పరిశీలిస్తున్నారు. మంగళవారం ఉదయానికి వరద పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ 77.988 టీఎంసీలు కాగా.. 52.011 టీఎంసీలుగా నమోదైంది. కండలేరుకు 6000, ఉత్తర కాలువకు 40, దక్షిణ కాలువకు 5, డెల్టాకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

చేనేతలకు సబ్సిడీపై నూలు

- చేనేత, జౌళి శాఖ అధికారి వరప్రసాద్

నెల్లూరు వ్యవసాయం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : చేనేత కార్మికులకు ముడి పదార్థాల సరఫరా పథకం (ఆర్ఎంఎస్ఎస్) కింద కేంద్ర ప్రభుత్వం 15శాతం సబ్సిడీతో నూలు సరఫరా చేస్తుందని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి వరప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత కార్మికులు, కార్మికులుగా సభ్య త్వం ఉన్న స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, మాస్టర్ వీవర్లు కూడా ఈ సబ్సిడీ పథకానికి అర్హులని తెలిపారు. సబ్సిడీ మొ త్తం నేరుగా చేనేతల బ్యాంకు ఖాతాలో జమ అవు తుందని అర్హులైన వారందరూ ముందుగా జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. చేనేత ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించేందుకు ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) అనే ఈ-కా మర్స్ వేదిక అందుబాటులో ఉందని పేర్కొన్నారు. చేనేత కార్మికులు ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం కింద గృహ అవసరాలకు విద్యుత్తును ఉత్పత్తి చేసుకునే సోలార్ రూఫ్ టాప్‌ను రాయితీతో పొందవచ్చని తెలిపారు. దీనికోసంగా బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలు కూడా అందిస్తాయని, పూర్తి వివరాలకు చేనేత, జౌళిశాఖ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలి

- అదనపు ఎస్పీ సౌజన్య



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు క్రైం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: ప్రజా ఫిర్యాదుల వేదికకు వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో సత్వరమే పరిష్క రించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూ రులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరిం చారు. జిల్లా వ్యాప్తంగా 30 మంది బాధితులు పాల్గొని వారి సమస్యలను ఏఎస్పీకి విన్నవించుకున్నారు. వాటిపై ఆయా ప్రాంతాల్లోని పోలీసు అధికారులతో ఏఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కునుకుపాటు ప్రాణాలు తీసింది!

- డ్రైవర్ నిద్రమత్తుతో అదుపు తప్పి కారు బోల్తా
- ఇద్దరు మహిళల మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు
- కొండారెడ్డిపాలెం మలుపు సమీపంలో ఘటన



కందుకూరులో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం(ఆంధ్ర జ్యోతి) అక్టోబరు 14 : డ్రైవర్ నిద్ర మత్తు ఇద్దరిని బలిగొం ది. సోమవారం తెల్లవారుజా మున కొండారెడ్డిపాలెం మలుపు సమీపంలోని రహదారిపై కారు అదుపు తప్పి రోడ్డు మార్జిన్ దాటి గట్టు పొలం తగిలి బోల్తా పడింది. దీంతో ఇద్దరు మహిళలు మరణించగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పోకూరు ఎస్సీ కాలనీకి చెందిన కాలే సామ్రాజ్యం (55), లింగాబత్తిన సులోచన (65, పర్రె చినకొండమ్మ, ప్రియదర్శిని, అమరావతి, ఉదయశ్రీలు కారులో సామ్రాజ్యం పెద్ద మనుమరాలు లావణ్య పెళ్లికి ఆదివారం రాత్రి నలదలపూరు వెళ్లారు. అక్కడ నుంచి తెల్లవారుజామున 4 గంటల సమయంలో కారులో తిరిగి వస్తుండగా డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కాలే సామ్రాజ్యం (55) అక్కడిక క్కడే మృతి చెందగా లింగాబత్తిన సులోచన (65) కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందింది. పర్రె చినకొండమ్మ, ప్రియదర్శిని, అమరావతి, ఉదయ శ్రీలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో అమరావతి, ఉదయశ్రీలను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న వలేటివారిపాలెం ఎస్ఐ మరిదినాయుడు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కందుకూరు ఆసుపత్రిలో క్షతగాత్రులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈయన వెంట పార్టీ స్థానిక నాయకులు ఉన్నారు.



జై భవాని.. జైజై భవాని!

రాజరాజేశ్వరి అమ్మవారి మాలధారణ భక్తులు ఇరుముడి ధరించి సోమవారం నెల్లూరు నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారి విగ్రహం ముందు జై భవాని.. జైజై భవాని అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు.

- నెల్లూరు

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం

● ప్రాణ నష్టనివారణే లక్ష్యం ● ఎస్‌ఎంసీలో సమీక్షించిన మంత్రి నారాయణ



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు సిటీ(ఆంధ్ర జ్యోతి),అక్టోబరు 14 : భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి విపత్తు సంభవించినా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం ఎస్‌ఎంసీ కార్యాలయంలో అధికారు లతో ఆయన సమీక్షించారు. జిల్లాలో మూడు రోజులపాటు భారీ వర్షాలుపడే అవకాశం ఉన్నట్లు ఎస్‌ఎండీ తెలిపిందన్నారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రాణ నష్టం ఎక్కడా జరగకూడదన్నదే తమ తొలి లక్ష్యమని చెప్పారు. కార్పొరేషన్‌తోపాటు ఇతర మున్సిపాలిటీల్లో వెంటనే కాలువల్లోని పూడికతీయాలని కమిషనర్లను ఆయన ఆదేశించారు. లోతట్టు, వర్షప్రభావంతో నీటి నిల్వలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జనరేటర్లు, తాగునీరు, ఇతర అవసరా లను సమకూర్చుతున్నామని, విజయవాడలోని కమాండ్ కంట్రోల్ నుంచి సూచనలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. కాగా మేయర్ స్రవంతి ముందుగా ఎస్‌ఎంసీలోని కమాండ్ కంట్రోల్ భవనంలో వర్షాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు.

విద్యుత్ శాఖలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నెల్లూరు జడ్పీ (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించ డంతోపాటు జిల్లాలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ సీఎండీ సంతోష్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో విద్యుత్ లైన్లు ఎక్కడైనా దెబ్బతింటే వాటికి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకునేందుకు నెల్లూరు జిల్లాకి సంబంధించి చీఫ్ జనరల్ మేనేజరు ఆదిశేషయ్యని నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. అలాగే ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఏర్పడితే 1912, 1800425155333, వాట్సప్ నెంబరు 9133331912ను ప్రజలు సంప్రదించవచ్చన్నారు.

రఫీ మరణించినట్లు చెప్పలేదు

● కేస్ షీట్‌లోనూ నమోదు చేయలేదు ● వైద్యచికిత్సలు అందిస్తున్నాం

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్

నెల్లూరు వైద్యం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : బతి కున్న వ్యక్తి మరణించాడని తమ ఆసుపత్రికి చెందిన వైద్యులు ప్రకటించలేదని నెల్లూరులోని ప్రభు త్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్ స్పష్టం చేశా రు. బతికుంటే చనిపోయాడని రోగి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారంటూ సోమవారం మీడియాలో వార్తలు వెలు వడ్డాయి. వీటిపై స్పందించిన సూపరింటెండెంట్ సిద్దా నాయక్ సోమవారం విచారణ జరిపి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10వ తేదీన నార్త్ రాజుపాళెం వద్ద షేక్ రఫీ(44) రోడ్డు ప్రమాదానికి గురవడంతో అపస్మారక స్థితిలో 108 అంబులెన్స్ ద్వారా జీజీహెచ్‌కు తీసుకువచ్చారన్నారు. వెంటనే వైద్యులు చికిత్స చేయడంతో బాధితుడు కోలుకున్నాడని చెప్పా రు. మరుసటి రోజు ఎక్స్‌రే, సిటీస్కాన్ తీశారని, తొడవద్ద ఎముక విరిగినట్లు తేలటంతో ఈ కేసును ఎముకల విభాగానికి అప్పగించామ న్నారు. అక్కడి వైద్యులు బాధితుడి కాలికి శస్త్రచికిత్స చేయబోతున్నారని తెలిపారు. కాలు విరగడం తప్ప బాధితునికి ఎలాంటి అనారోగ్య సమస్య లేదన్నారు. కాగా, రోగి రఫీ మృతిచెందారన్న వార్తలపై పూర్తి స్థాయి విచారణ జరిపానన్నారు. రఫీ మరణించినట్లు ఏ వైద్యుడూ చెప్పలేద న్నారు. కేస్‌షీట్‌లో సైతం ఈ విషయం రాయలేదని తెలిపారు. రఫీతో పాటు ఆయన భార్యను కూడా విచారించామని రోగి మరణించినట్లు పోలీసులు సమాచారమిచ్చినట్లు తెలిపారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : మండలంలోని పుంజులూరుపాడు సమీపంలో కృష్ణపట్నం పోర్టురోడ్డుపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాల య్యాయి. వివరాల మేరకు.. పొదలకూరు పట్టణానికి చెందిన సురేష్, అశోక్‌లు పని నిమిత్తం మోటర్‌బైక్‌పై ముత్తుకూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు కారణంగా బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఒక ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడి అరెస్టు

మనుబోలు(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మంద పోలయ్యను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివరాకేష్ తెలిపారు. మండలంలోని అక్కంపేటలో గిరిజన మహిళపై అత్యాచారయత్నంకు ఆయన పాల్పడిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి విచారణ పూర్తయిన తరువాత నిందితుడు పోలయ్యను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

ప్రియురాలి ఫిర్యాదుతో
ప్రియుడిపై అత్యాచారం కేసు నమోదు

మర్రిపాడు (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: ప్రియుని చేతిలో మోసపోయినట్లు ప్రియు రాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఓ యువకునిపై అత్యాచారం కేసు నమోదయింది. పోలీసుల వివరాల మేరకు.. ఉదయగిరి మండలం కుర్రపల్లి గ్రామానికి చెందిన యువకుడు, మర్రిపాడు మండలం చాబోలు గ్రామానికి చెందిన యువతి గత మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. సదరు యువకుడు పెళ్లికి నిరాకరించడంతో తనను మోసం చేశాడని యువతి మర్రిపాడు స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. దీంతో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించి, యువకునిపై అత్యాచారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

చైర్‌పర్సన్ ఆమోదంతోనే బదిలీలు చేపట్టాం

● హైకోర్టుకు నివేదించిన నెల్లూరు జడ్పీ సీఈవో

● తనను సంప్రదించకుండానే చేశారంటూ చైర్‌పర్సన్ పిటిషన్

● తదుపరి విచారణ 19కి వాయిదా

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను సంప్రదించి, ఆమె ఆమోదం పొందిన తరువాతే జిల్లా ప్రజా పరిషత్ పరిధిలోని ఉద్యోగులను బదిలీ చేశామని నెల్లూరు జడ్పీ సీఈవో హైకోర్టుకు నివేదించారు. తనను సంప్రదించకుండానే నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ పరిధిలోని ఉద్యోగులను, సిబ్బందిని జడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి(సీఈవో) ఏకపక్షంగా బదిలీ చేస్తున్నారంటూ నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ దాఖలు చేసిన వ్యాజ్యం హైకోర్టులో సోమవారం మరోసారి విచారణకు వచ్చింది. ఉద్యోగులను బదిలీ చేస్తూ జడ్పీ సీఈవో ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని ఆ వ్యాజ్యంలో అరుణమ్మ అభ్యర్థించారు. జడ్పీ సీఈవో తరఫు న్యాయవాది, స్టాండింగ్ కౌన్సిల్ బీవీ అపర్ణలక్ష్మి వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం జారీ చేసిన జీవో 594 ప్రకారం జిల్లా ప్రజా పరిషత్ పరిధిలోని ఎంపీడీవోలతో పాటు జడ్‌పీపీ, ఎంపీపీలలో పనిచేసే ఉద్యోగుల బదిలీల ప్రక్రియ చేపట్టామని తెలిపారు. బదిలీల ఆమోదం కోసం గత నెల 22న ఫైలును చైర్‌పర్సన్‌కు పంపించామని, దానిపై చైర్‌పర్సన్ సంతకం కూడా చేశారని వివరించారు. అందుకు సంబంధించిన నోట్ ఫైల్‌తో పాటు బదిలీలకు సంబంధించి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను కోర్టు ముందు ఉంచారు. ఈ వివరాలను పరిశీలించిన న్యాయస్థానం, రికార్డులను పరిశీలిస్తే ఉద్యోగుల బదిలీకి ఆమోదం తెలుపుతూ జడ్పీ చైర్ పర్సన్ సంతకం చేసినట్లు స్పష్టంగా కనపడుతోందని తెలిపింది. పిటిషనర్‌కు ఉన్న అభ్యంతరం ఏంటని ప్రశ్నించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది శివప్రసాద్ రెడ్డి స్పందిస్తూ... జడ్పీ సీఈవో కోర్టుముందు ఉంచిన వివరాలు తనకు అంద జేయలేదన్నారు. పిటిషనర్‌ను సంప్రదించిన తర్వాత ఈ వ్యవహారంపై వాదనలు వినిపిస్తానని, సమయం ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన న్యాయ మూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేశారు. బదిలీలకు సంబంధించి కోర్టు ముందు ఉంచిన రికార్డుల కాపీని పిటిషనర్‌కు అందజేయాలని జడ్పీ సీఈవో తరఫు న్యాయవాదిని ఆదేశించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	145
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	258
స్కిన్‌లెస్	284
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7334
వెండి కిలో ధర	రూ. 92,900
వెండి ఒక గ్రాము	రూ. 96.00

పేకాట స్థావరంపై దాడులు

నెల్లూరు క్రైం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: నెల్లూరులోని కిసాన్‌నగర్‌లో ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వ హిస్తున్న పేకాట కేంద్రంపై ఆదివారం రాత్రి నవాబుపేట పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న అజారుద్దీన్, షబ్బీర్, కొండయ్య, కృష్ణయ్య, తులసీదాస్, శ్రీనివాసులురెడ్డి, దొరస్వామి, నరసిం హులును అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.89.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

చేతుల శుభ్రతతోనే
ఆరోగ్యం

● హ్యాండ్ వాష్ చేయకపోవడంతోనే 60 శాతం వ్యాధులు

● ప్రాణాంతక రోగాలకూ అవకాశం

● ప్రాధాన్యంపై నిర్లక్ష్యం వీడాలి

● నేడు హ్యాండ్ వాషింగ్ డే



నెల్లూరు వైద్యం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : మానవ తప్పిదాల వల్ల అనేక వ్యాధులు వస్తున్నాయి. తెలిసి కూడా జాగ్రత్తలు పాటించక పోవడం ఇందుకు కారణం. ముఖ్యంగా చేతుల పరిశుభ్రతపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంది. ఆహారం తినే ముందు, మల విసర్జన అనంతరం చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడంతో పలు వ్యాధులు వస్తున్నాయి. చేతుల శుభ్రతపై వైద్యులు ఇస్తున్న సూచనలను గాలికి వదిలేస్తున్నాం. దీంతో టైఫాయిడ్, అతిసార, కలరా, బంక విరోచనాలు, ఫంగస్ వంటి వ్యాధులు సంక్రమిస్తున్నాయి. ఇవి అంటురోగాలుగా మారి ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తున్నాయి. ఫలితంగా వ్యాధిగ్రస్తులు మంచాన పడుతున్నారు. ఒక్కొక్కసారి ఈ వ్యాధులను నిర్లక్ష్యం చేయడంతో ప్రాణాలపైకి వస్తున్నది. కేవలం చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోకపోవడం వల్ల జిల్లాలో కొన్ని మరణాలు కూడా వెలుగు చూశాయంటే దీని తీవ్రత ఎలా ఉందో అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్యసంస్థ అక్టోబరు 15న (నేడు) హ్యాండ్ వాషింగ్ డేగా నిర్వహించుకోవాలని తీర్మానించింది. తద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించింది.

● శుభ్రత లేకనే 60శాతం వ్యాధులు

ప్రస్తుతం నమోదవుతున్న రోగాల్లో 60 శాతం చేతులు అపరిశుభ్రత వల్లే ప్రబలుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. వీటిలో అతిసారా, కలరాతో పాటు శ్వాసకోశ వ్యాధులు ప్రమాదకరంగా పరిగణిస్తున్నాయి. ప్రత్యేకించి స్వైన్‌ఫ్లూ వంటి ప్రాణాంతక వ్యాధి కూడా వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. అపరిశుభ్రమైన చెత్తతో ఆహారం తినడం వల్ల ఆయా చేతులలో ఉన్న బ్యాక్టీరియా, బ్యాక్టీరియా గుడ్లు కడుపులోకి వెళ్లి వ్యాధులు కలుగచేస్తున్నాయి. ఈ పరిస్థితిలో చేతుల పరిశుభ్రతపై జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేకించి చిన్నపిల్లలు మట్టిలో ఆడుకోవటం, చేతులు శుభ్రత పాటించక పోవటం వల్ల అనేక వ్యాధులుతో వారు అల్లాడుతున్నారు. జిల్లాలోని 52 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీలు, రెండు ఏరియా ఆసుపత్రులు, ఒక జిల్లా ఆసుపత్రి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉన్నాయి. ఇక్కడకు వచ్చే రోగుల్లో అత్యధికులు చేతుల పరిశుభ్రత పాటించక అనారోగ్యం పాలైనవారే.

● తగిన ప్రచారం ఏదీ

ప్రభుత్వపరంగా చేతుల పరిశుభ్రతపై ప్రచారం నిర్వహించాల్సి ఉంది. అయితే ఆదిశగా చర్యలు మాత్రం తీసుకోవటం లేదు.ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ, విద్యా శాఖ, ఐసీడీఎస్‌లు సంయుక్తంగా చేతుల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కలిగించాలి. అయితే ఆ దిశగా చర్యలు లేవు. ప్రతీ పాఠశాలల్లో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై శిక్షణ ఇవ్వాల్సి ఉన్నా విద్యా శాఖ ఆ దిశగా కర్తవ్యాన్ని నెరవేర్చడంలేదు. ఇక అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులతో పాటు గర్భవతులకు దీనిపై అవగాహన కల్పించకపోవడంతో గర్భిణీలు రక్తహీనతకు గురవుతున్నారు. స్వచ్ఛభారత్ - స్వచ్ఛ ఆంధ్రా జరుగుతున్న ప్రస్తుత తరుణంలో పరిసరాలతో పాటు చేతుల పరిశుభ్రతపై కూడా ఉవ్వెత్తున చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

చేతులు కడగడం ఎలా..?

- వేడి నీటితో కానీ, చల్లటి నీటితో కానీ మణికట్టు వరకు శుభ్రం చేసుకోవాలి.
- వేళ్ల మధ్య, వేలి గోళ్ల కింద, మోచేతులు, మణికట్టు వెనుక భాగంలోనూ సబ్బుతో బాగా రుద్ది శుభ్రం చేసుకోవాలి.
- చేతుల్లో ఎలాంటి మలినాలు లేకుండా చూసుకోవాలి.
- కడిగాక పొడి వస్త్రంతో చేతులు శుభ్రంగా తుడుచుకోవాలి.

హెపటైటీస్ వచ్చే అవకాశం



చేతుల శుభ్రత పాటించక పోవటంతో హెపటైటీస్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. చేతుల శుభ్రత లేకుండా ఆహారం తింటే తీవ్ర రోగాలు వస్తాయి. చేతుల పరిశుభ్రతపై విస్తృత ప్రచారం అవసరం. కేవలం సబ్బుతోనే చేతులు కడుక్కుంటే సరిపోతుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని పిల్లలకు చేతుల పరిశుభ్రతపై తప్పనిసరిగా అవగాహన కలిగించాలి.

- డాక్టర్ పోకల రవి, చెస్ట్ ఫిజిషియన్

శుభ్రత నిర్లక్ష్యం వల్లే వ్యాధులు



చేతులు పరిశుభ్రతతోనే ఆరోగ్యం మెరుగు పరుచుకోవచ్చు. దినచర్యలో భాగంగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులను సబ్బుతో కడగాలి. తద్వారా క్రిములు కడుపులోకి పోకుండా ఆపుకోవచ్చు. లేదంటే ఈ క్రిములు ఊపిరితిత్తులోకి చేరి శ్వాసకోశవ్యాధులకు దారితీస్తాయి. చిన్నతనం నుంచే చేతుల పరిశుభ్రతను పిల్లలకు తల్లిదండ్రులు అలవాటు చేయాలి.

- డాక్టర్ గంగాధర్, జీజీహెచ్ జనరల్ ఫిజిషియన్, అసోసియేట్ ప్రొఫెసర్

చేతులు ఎప్పుడు శుభ్రం చేసుకోవాలి

- పిల్లలు సహా ప్రతి ఒక్కరూ మలాన్ని తాకిన తర్వాత..
- ఆహారాన్ని ముట్టుకొనే ముందు
- పిల్లలకు ఆహారం తినిపించే ముందు
- అనారోగ్యంతో ఉన్నవారికి భోజనం పెట్టే ముందు, మందులు ఇచ్చే ముందు
- చర్మానికి గాయాలయినప్పుడు
- పచ్చిమాంసాన్ని తాకినప్పుడు
- దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, ముక్కు చీదినప్పుడు
- పెంపుడు జంతువులను తాకినప్పుడు, వాటిని కడిగినప్పుడు
- ప్రయాణం చేసినప్పుడు
- చిన్నపిల్లలు బడి నుంచి ఇంటికి వచ్చాక

తప్పించుకుందామంటే కుదరదు

● ప్రజల అర్జీలను పరిష్కరించాల్సిందే! ● ఇప్పటి వరకు దాటవేస్తున్న తహసీల్దార్లు

● 15 మందికి మెమోలు జారీ చేసిన కలెక్టర్

నెల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మారినా రెవెన్యూ శాఖ పనితీరు మాత్రం ఇంకా మారడం లేదు. మేమింతే.. మా పని తీరింతే.. అన్నట్లు కొందరు రెవెన్యూ సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న అర్జీలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి వాటిని పరిష్కరిం చాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా జిల్లాలో మాత్రం కొన్ని మండలాల తహసీల్దార్లు గత ప్రభుత్వ పోకడలు వదలించుకోవడం లేదు. సమస్యను పరిష్కరించకుండానే తప్పించుకుంటున్నారు. ఆఖరుకు ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కూడా నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారంటే ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంత ప్రాధాన్యతను ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వందల సంఖ్యలో అర్జీ లుదారులు వస్తున్నారు. తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించు కుంటున్నారు. ఇలా వస్తున్న అర్జీల్లో సగం వరకూ రెవెన్యూ శాఖవే ఉంటున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూఅక్రమాలు, ఆక్రమణల మూలంగా సమస్యలు పెరిగిపోయాయి. వీటిని పరిష్కరించాలని కలెక్టరే ట్ నుంచి ఆయా మండలాల తహసీల్దార్లకు ప్రజల అర్జీలు వెళుతు న్నాయి. కానీ కొందరు తహసీల్దార్లు ఈ సమస్యలను పరిష్కరించకపోగా పరిష్కరించినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇంకొందరైతే ఏవేవో సాకులు చెబుతూ గ్రీవెన్స్‌ను క్లోజ్ చేస్తున్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం జరిగే సమస్యలు కూడా అక్కడ పరిష్కారమవడం లేదు. పైగా ఉన్నతాధికారులకు, అర్జీదారునికి తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారు. దీంతో పదే పదే అర్జీలు రీఓపెన్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అర్జీల సమస్యలు పరిష్కరించని తహసీల్దార్లపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. సమస్యను పరిష్కరించకుండానే గ్రీవెన్స్ క్లోజ్ చేసిన తహసీల్దార్లకు కలెక్టర్ ఓ ఆనంద్ మెమోలు జారీ చేశారు. సుమారు 15 మంది తహసీల్దార్లకు మెమోలు జారీ అయినట్లు తెలిసింది. ప్రస్తుతం రీఓపెన్ అయిన అర్జీల పరిస్థితిని పరిశీలిస్తున్నారు. ఇది పూర్తయ్యాక మరికొంత మంది తహసీ ల్దార్లకు కూడా మెమోలు జారీ అయ్యే అవకాశాలున్నట్లు సమాచారం. ఇలా మెమో జారీ అయిన తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకపోతే తదుపరి షోకాజు నోటీసులు ఇచ్చి సీరియస్ యాక్షన్ తీసుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం ఇప్పుడు రెవెన్యూ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● జడ్పీ ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు



రామతీర్థంలో తుఫాన్ షెల్టర్‌ని పరిశీలిస్తున్న జడ్పీ ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు, ఎంపీడీవో నగేష్‌కుమారి

విడవలూరు (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడుతున్నందున వచ్చే మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో మండలాధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరిషత్ సీఈవో మోహన్‌రావు ఆదేశించారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో ఉన్న తుపాను షెల్టర్‌ను ఎంపీడీవో నగేష్‌కుమారితో కలసి సోమవారం అయన పరిశీలించారు. ఈసందర్భంగా అయన పంచాయతీ, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అల్పపీడనం తుపానుగా మారే అవకాశాలు ఉండటం వలన ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఆనంతరం ఎంపీడీవో రామచంద్రాపురం, కొత్తూరు, పొన్నపూడి పెద్దపాళెం, లక్ష్మీపురంలో పర్యటించి భారీ వర్షాలలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై గ్రామ కాపులతో సమావేశం నిర్వహించి చర్చించారు.

ఒక్కొక్కరికి మూడు మండలాలు

● నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రక్షాళన ● ఉద్యోగుల బాధ్యతల్లో మార్పు

● నూతన ఆర్డీవో అనూష కొత్త పంథా



నెల్లూరు ఆర్డీవో కార్యాలయం



కార్యాలయంపై కప్పిన పట్టలను పరిశీలిస్తున్న ఆర్డీవో

నెల్లూరు వెంకటేశ్వరపురం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : నెల్లూరు డివిజనల్ రెవెన్యూ కార్యాలయ ప్రక్షాళనకు నూతన ఆర్డీవో నాగ సంతోష్ అనూష శ్రీకారం చుట్టారు. గతంలో ఎన్నడూ చేయని విధంగా కార్యాలయ ఉద్యోగులకు వినూత్నంగా బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ల్యాండ్ కన్వర్షన్ విభాగం ఒకరి చేతుల్లోనే ఉండేది. టపాసుల లైసెన్స్ బాధ్యతలు ఒక్కరే చూసేవారు. నెల్లూరు రెవెన్యు డివిజన్ పరిధిలోని 12 మండలాల పరిధిలో సమస్యను బట్టి సదరు అధికారి వద్దకు వెళ్లి ప్రజలు పరిష్కరించుకునేవారు. అయితే నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో పరిపాలన తీరుపై, ల్యాండ్ కాన్వర్షన్‌పై గతంలో పలు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నూతన ఆర్డీవో ప్రక్షాళన దిశగా అడుగులు వేశారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్క రించే విధంగా, ఉద్యోగలపై కూడా పని వత్తిడి లేకుండా వినూత్నంగా మూడు మండలాలకు ఒక ఉద్యోగికి బాధ్యతలు అప్పగించారు. ఇకపై కీలకమైన ల్యాండ్ కన్వర్షన్ బాధ్యతలను ఆర్డీవోతోపాటు ఇద్దరు ఉద్యోగులు పర్యవేక్షించనున్నారు. అదేవిధంగా టపాసుల గోదాములు, విక్రయాలకు అనుమతి మంజూరు తదితర విధులను ముగ్గురికి అప్పగించారు. కాగా, కొత్త ఆర్డీవో అనూష కార్యాలయంలోని అన్నీ సెక్షన్లను పరిశీలించారు. ఉద్యోగులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా కార్యాలయ భవనం పాడుబడిపోయిందని తెలిపారు. సంవత్సరాల తరబడి వర్షాకాలంలో కార్యాలయ భవనంపై పట్టలు కప్పుతున్నట్లు చెప్పారు. రికార్డులను భద్రపరిచేందుకు ర్యాక్‌లు అవసరమని తెలిపారు.

పారదర్శక పరిపాలన కోసమే.. నాగ సంతోష్ అనూష, ఆర్డీవో



కార్యాలయానికి వచ్చే ప్రజలకు పారదర్శకంగా పరిపాలన అందించాలనే ఉద్దేశంతోనే ప్రక్షాళన చేశాము. గతంతో ఒక్కరిపైనే బాధ్యతను పెట్టేవారు. అలా కాకుండా మూడు మండలాలకు ఒక ఉద్యోగికి బాధ్యతలు అప్పగించాము. గతంలో ల్యాండ్ కన్వర్షన్ ఒక్కరి చేతుల్లోనే ఉండేది. దానిని స్వయంగా నాతోపాటు ఇద్దరు ఉద్యోగులకు అప్పగించాము. టపాసుల లైసెన్స్‌ల బాధ్యతలు కూడా ముగ్గురికి అప్పగించాం. ఇలా కార్యాలయంలో బాధ్యతలను విభజించాను. ఎక్కడా అవినీతి లేకుండా గట్టి చర్యలు తీసుకొంటున్నాను. కార్యాలయ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాను.

దసరా మామూళ్లు వసూలు చేస్తే కఠిన చర్యలు

● ట్రాన్స్‌కో డీఈఈ రమేష్ చౌదరి

విడవలూరు(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: దసరా పండుగ పేరుతో రైతులు, ప్రజల వద్ద వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో డీఈఈ రమేష్ చౌదరి హ ఎచ్చరించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన లైన్‌మెన్ల దసరా చందాల దందా కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు డీఈఈ విచారణ చేపట్టినట్లు తెలిపారు. లైన్‌మెన్లు అక్రమంగా వసూలు చేశారని ఏవరైనా ఫిర్యాదు ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. దసరా పండుగని పురస్కరించుకుని చందాలు వసూలు చెయ్యమని ఏవరూ ప్రోత్సహించరన్నారు. ఇటువంటి తప్పులు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

తీరప్రాంతంలో సబ్ కలెక్టర్ పర్యటన


బాలకోటయ్య సంఘం ఎస్టీ కాలనీవాసులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 14 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీరప్రాంత, లోతట్టు గ్రామా లు కరేడు, చాకిచర్ల, పెద్దపట్టపుపాలెం, రామాయపట్నం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ సూచించారు. సోమవారం కరేడు పంచాయతీ పరిధిలోని బాలకోటయ్య సంఘం ఎస్టీ కాలనీ సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తుఫాన్ షెల్టర్‌ను పరిశీలించారు. రెండు రోజుల్లో అధికారులు అన్నింటికి సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ లావణ్యను ఆదేశించారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి రూరల్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రత చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున వాగులు, వంకలు పొంగే అవకాశమున్నందున ప్రజలు వాటి వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కరీముల్లా, నాగూర్‌బీ, చంద్రశేఖర్, శ్రీనివాసులు, వెంకటరమణ, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: తుఫాన్ సూచనలతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా పట్టణ ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు సమాచార నిమిత్తం కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందని తెలిపారు. పట్టణ ప్రజలు అత్యవసర సహాయం కోసం 08627-796692 నెంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు


వీర్లగుడిపాడులో పర్యటిస్తున్న ఆర్డీవో పావని, సీఐ వేమారెడ్డి

కావలి (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కావలి ఆర్డీవో ఎం. వంశీక్రిష్ణ తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని తీరప్రాంతంలో పర్యటించి మత్స్యకా రులు, ప్రజలను అప్రమత్తం చేశారు. తుమ్మలపెంట తీరంలో మత్స్యకారులతో మాట్లాడారు. సముద్రంలో వేటకు వెళ్ల వద్దని సూచించారు. కరేటి వారిపాలెం, చినరాముడిపాలెంలలో తుఫాన్ షెల్టర్లను పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పుడు అవసరమనుకుంటే అప్పుడు తుఫాన్ షెల్టర్లకు తరలించేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు.

● సంగం(ఆంధ్రజ్యోతి): భారీ వర్ష సూచనలతో ఆత్మకూరు ఆర్డీవో పావని సోమవారం గ్రామాల్లో పర్యటించారు. మొదట స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి మండలంలోని పెన్నా ముంపు ప్రాంతమైన వీర్లగుడిపాడు గ్రామాన్ని సందర్శించి అప్రమత్తంగా ఉండాలని, వర్షంతో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్థులకు సూచించారు. ఆమె వెంట సీఐ వేమారెడ్డి, ఆర్ఐ రాజనారాయణ, వీఆర్వో నాయబ్‌రసూల్ ఉన్నారు.

ఎడతెరిపిలేని వర్షం

● కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో భారీ వర్షం ● నీట మునిగిన కాలనీలు , పంట పొలాలు
● ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు ● రోడ్లపై ప్రవహించిన వర్షపు నీరు


జలమయమైన కావలిలోని ఇందిరమ్మ దివ్యాంగుల కాలనీ


మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

ఉదయగిరి రూరల్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మె ట్టప్రాంతమైన ఉదయగిరిలో సోమవారం తెల్లవారుజా ము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపిలేని వర్షం కురిసి 67.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా పట్టణంలోని మురుగు కాలువలు పొంగి పొర్లాయి. వీధుల్లో వర్షపు నీరు కురవడంతో జనజీవనం స్తంభించింది. ఈ వర్షం రబీ సీజన్‌లో సాగు చేసే పంటలకు ఊరటనిచ్చింది.

సంగం: మండల పరిసర ప్రాంతాల్లో ఉదయం8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వర్షం కురిసింది. 113.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. గ్రామాల్లో వీధులు జలమయమై జనజీవనం స్తంభించింది.

అనంతసాగరం: మండలంలో ఎడతెరపిలేని వర్షంతో వాగులు, వంకలు నిండాయి. అనంతసాగరం చెరువుకు నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల వరికోతలు నిలిచిపోయాయి. కమ్మవారిపల్లి, పీకేపాడులో వేరుశనగకు నష్టం వాటిల్లింది. కొత్తపల్లి, కచ్చేరిదేవరాయపల్లి, రేవూరులో తహసీల్దారు వీరవసం తరావు పర్యటించి రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆత్మకూరు సీఐ గంగాధర్ పోలీసు సిబ్బందితో కలిసి వాగులు పరిశీలించారు.

కావలి: పట్టణంలోని వైకుంఠపురం, అన్నపుగుంట, పాతూరు, దివ్యాంగుల కాలనీ, ముసునూరు ఇందిరమ్మకాలనీ తదితర ప్రాంతాలు సోమవారం కురిసిన వర్షానికి నీట మునిగాయి. ప్రధానంగా వర్షపు నీరు వేళ్లే మార్గాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో ఈ సమస్య నెలకొంది. అన్నపుగుంటకు అటవీ ప్రాంతం నీరంతా వచ్చి చేరుతుంది. ఆ నీరు వెళ్లే వరవ కాలువ ఆక్రమణలతో కుదించుకుని పోవటం, రైల్వే ట్రాక్ వెంబడైనా వర్షపునీరు వెళ్లేందుకు కాలువలు తీయకపోవటంతో ఈ ప్రాంతాలు నీట మునిగాయి. పట్టణంలోని నీరంతా పాతూరు ప్రాంతం నుంచి దిగువకు పొలాల మీదుగా వెళ్లేది. ఆ పొలాలను లేఅవుట్లుగా మార్చి గోడలు నిర్మాణం, కాలువలను ఆక్రమించటంతో ఆ ప్రాంతం నీట మునుగుతోంది. ముసునూరు గిరిజన కాలనీ వెంబడి ఉన్న వర్షపునీటి కాలువలను ఆక్రమించారు. అలాగే దివ్యాంగుల కాలనీలో కూడా వర్షపు నీరు వెళ్లే కాలువలు లేక నీట మునుగుతోంది. అధికారులు ముందు జాగ్రత్తగా వర్షపు నీరు వెళ్లే మార్గాలను ఏర్పాటు చేయకుండా వర్షం వచ్చిన రోజు హడావుడి చేసి వదిలేస్తుండటంతో పట్టణ ప్రజలకు నీటి మునక సమస్య తప్పటం లేదు.

కావలి టౌన్: కావలిలో ఆదివారం రాత్రి నుంచి ఎడ తెరిపి లేని వర్షంతో కాలనీల్లోని రోడ్లన్నీ జలమయమై రాకపోకలకు అంతరాయం కలిగింది. ముసునూరు గిరిజన కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరడంతో సమీప బంధువుల ఇళ్లలో తలదాచుకున్నారు. ముసునూరు అయ్యప్ప గుడి, ఆటోనగర్ ప్రాంతాల్లోని ట్రంకురోడ్డుపై పెద్దఎత్తున వర్షపు నీరు ప్రవహించింది. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాలతో మున్సిపల్ అధికారులు సిబ్బంది రంగంలో దిగి జేసీబీ సహకారంతో పూడిపోయిన కాలు వలను తవ్వి వర్షపునీరు ముందుకు పారేలా తాత్కాలిక చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి స్వీయ నిధులతో ముసునూరు ఆటోనగర్ ట్రంకురోడ్డు వద్ద దెబ్బతిన్న రోడ్డు నిర్మాణం చేపట్టడంతో వాహనాలు రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఏర్పడ లేదు.

అల్లూరు: కుండపోత వర్షంతో కాలువలు, గుంటలు నిండిపోయాయి. తీరప్రాంతమైన ఇస్కపల్లిలో తహసీల్దారు లక్ష్మీనారాయణ పర్యటించి వారికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక చర్యల్లో భాగంగా ప్రతి ప్రాంతానికి ఒక అధికారిని నియమించామన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడద ని చెప్పారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

జలదంకి: వర్షంతో రోడ్లతో పాటు పంట పొలాలు జలమయయ్యాయి. వరినారు మళ్లకు సిద్ధమైన రైతులకు ఈ వర్షం ఉపయోగకరంగా ఉందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో వ్యవసాయ పనులు ముమ్మరం కానున్నాయి.

లింగసముద్రం: మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. కలెక్టరు ఆనంద్ ఆదేశాల మేరకు అన్నిశాఖల అధికారులు అప్రమత్తయ్యారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నుంచి వాటర్ ప్లాంటు వరకు రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్లను ఆక్ర మించి ఎత్తుగా మట్టి పోయడంతో కాలువను తలపిస్తోంది. అయితే ఈ వర్షాలకు జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద గుడారాలలోని రెండు కుటుంబాలను తహసీల్దార్ ఎస్.సీతా మహాలక్ష్మి వీఆర్ఓలు మస్తాన్‌వలి, నాగరాజులతో పెంట్రాల పాఠశాలకు తరలించి వసతి సౌకర్యం కల్పించారు. వీరికి పెంట్రాల టీడీపీ నాయకుడు కిలారి కొండయ్య ద్వారా భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.మాధ వరావు, మహిళా పోలీసు ప్రియాంక పాల్గొన్నారు.

కొండాపురం: మండలంలో 44.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కలెక్టరు ఆదేశాలతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తహసీల్దార్ ఎమ్.కోటేశ్వరరావు తెలిపారు. వీఆర్‌వోలు వారి గ్రామాల ప్రజలకు తుఫాను సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలపాలన్నారు.

చిట్రగుంట: అల్పపీడన ప్రభావంతో మత్స్యకారులు వలలు, పడవలను ఒడ్డుకు చేర్చుకున్నారు. జువ్వలదిన్నె కార్యదర్శి శ్రీనివాసులు సచివాలయ సిబ్బంది తీరప్రాంత వాసులను అప్రమత్తం చేశారు. స్థానిక ఎస్సై బోజ్యా సిబ్బందితో కలసి తీరప్రాంతాల్లో పర్యటించి లోతట్టు ఉన్న వారికి సురక్షిత స్థావరాల ఏర్పాటు గురించి వివరించారు. ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దారు సురేష్ బాబు, ఏవో గోవిందరావు మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు.

కందుకూరు: ఈ ఏడాదిలో మొదటిసారిగా ఎడతెరిపి లేని వర్షం కురవడంతో చెరువులు, కుంటలకు స్వల్పంగా నీరు వచ్చి చేరింది. రబీ పైర్ల సాగుకు పూర్తి అనుకూల పరిస్థితులు ఏర్పడినట్లు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కందుకూరులోని అనేక కాలనీల్లో మురుగు కాలువలు పొంగడంతో రోడ్లపైకి నీరు చేరింది. మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికతో కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

కలిగిరి: పరికోట వాగు ఉధృతిని తహసీల్దారు చొప్ప రవీంద్రబాబు ఆర్ఐ అన్నపూర్ణ, వీఆర్వో వనితలతో కలిసి పరిశీలించారు. అనంతరం వెంకన్నపాలెం ఎస్టీ కాలనీలోకి వర్షపునీరు రావడంతో ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి జేసీబీతో నీరు తరలింపునకు చర్యలు తీసుకున్నారు.

ఉలవపాడు: సోమవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి మన్నేటికోట తిరుపతికుంట, ఉలవపాడులోని ఎంపీడీవో కార్యాలయం వద్ద కోటిరెడ్డి కుంట, వెంకారెడ్డి కుంట కట్టపై ఉన్న ఎస్టీల గుడిసెల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. సోమవారం ఒక్కరోజు మండలంలో 8 సెం.మీ వర్షపాతం నమోదు అయ్యింది. లోతట్టు ఎస్టీ కాలనీవాసులకు అధికారులు అప్రమత్తతతో ఉండి పునరావాసం, వసతులు, ఆహారం అందించే ఏర్పాటు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం వర్షంతో కుంటల నీరు చేరుతుంది.


కావలి: నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తను తొలగిస్తున్న ఎక్సకవేటర్


రేవూరులో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దారు వీరవసంతరావు

పంచాయతీల అభివృద్ధికి నిధుల వరద : ఎమ్మెల్యే కాకర్ల


శిలాఫలకం వద్ద కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి

జలదంకి(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరకొరగా మంజూరు అయిన పంచాయతీల నిధులను కూడా పక్కదోవ పట్టించగా నేడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పంచాయతీలకు నిధుల వరద కురిపిస్తోందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. జోరువానను కూడా లెక్కచేయకుండా సోమవా రం ఎమ్మెల్యే మండలంలో నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. జమ్మలపాలెంలో రూ.20లక్షలు, జలదంకిలో రూ.27.50లక్షలు, బ్రాహ్మణక్రాకలో రూ.25లక్షలు, చినక్రాకలో రూ.28లక్షలు ఉపాధిహామీ నిధులతో నిర్మించనున్న సిమెంటు రోడ్లకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురే ష్ మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు బీజేపీ సహకారంతో అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలు పూర్తికాకముందే పంచాయతీలకు కేంద్రం నుం డి వచ్చే 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్‌ల బ్యాంకు ఖాతాల్లో వేయించడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌లను దిష్టిబొమ్మలుగా మార్చారని, కనీసం వారు బ్లీచింగ్ పౌడర్ చల్లించేందుకు ఖాతాల్లో నగదు లేని పరిస్థితి ఉండేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టించడమే తన ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, పార్టీ మండలా ధ్యక్షుడు మధుమోహన్‌రెడ్డి, నేతలు పూనూరు భాస్కర్‌రెడ్డి, వంటేరు జయచంద్రారెడ్డి, మందపల్లి మాల్యాద్రియాదవ్, కంచర్ల వినోద్‌నాయుడు,నక్కా మాధవ రావు, ఏగూరి రఘు, గుర్రం ప్రవీణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి : ఇంటూరి

ఉలవపాడు (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. పెద్దపట్టపుపాలెంలో రూ.34.86 లక్షలు, చాకిచర్లలో రూ.30.53 లక్షలు, చాగొల్లులో రూ.27లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవ న్‌కల్యాణ్ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తు న్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.విజయ, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు, పార్టీ గ్రామ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసులు, ఆవుల రఘు, మల్లికార్జున, నేతలు కారసాల అంకపనాయుడు, వల్లూరి వెంకటరమణ్య, కడియాల సుబ్బారావు, వర్దినేని శ్రీనివాసులు పాల్గొన్నారు.

● సీసీరోడ్లకు శంఖుస్థాపన

కలిగిరి (ఆంధ్రజ్యోతి): సిద్దనకొండూరు, పోలంపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, స్థానిక నాయకులు గంగినేని రంగారావు, దారా రాఅయుడు, గెనేడు పెంచల నరసింహ, గొట్టిపాటి వెంక టేశ్వర నాయుడు, బాల మస్తానయ్య నాయుడు, కల్లూరు చంద్రమౌళి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా నిమజ్జనోత్సవం


గ్రామోత్సవంలో అమ్మవారు

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని సోమవారం నిమజ్జనానికి తరలించారు. అలాగే నవరాత్రుల సందర్భంగా ప్రతి రోజు వివిధ అలంకరణల్లో పూజలందుకున్న అమ్మవారి విగ్రహాలను బాలాజీనగర్, మెయిన్‌బజార్‌లతోపాటు శివాలయం వరకు గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం అమ్మవారి ప్రతిమను మండలంలోని గండిపాళెం జలాశయంలో నిమజ్జనం చేశారు.

భూములు పంపిణీ చేయాలి

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి),అక్టోబరు 14: సాగు భూములు పంపిణీ చేయాలని స్థానిక ముస్లింలు తహసీల్దారుకు సోమవారం వినతిపత్రం అందచేశారు. ఆత్మకూరు మండలంలోని ముస్లింలు చాలా మంది వ్యవసాయ కూలీలు, బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారని, వారికి సాగు భూములు పంపిణీ చేయాలని కోరారు. ఐయుఎంఎల్ పార్టీ స్టే ట్ మీడియా ఇన్‌చార్జ్ మహమ్మద్ మసన్ బేగ్, జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ షు కూర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 14: మొగిలిచెర్ల మన్నేరు వాగు ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ సుబానీ తెలిపారు. ట్రాక్టరును పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

ముళ్లచెట్లలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్) (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: మండలంలోని నందిపాడు గ్రామ సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి ముళ్లచెట్లలోకి దూసుకెళ్లింది. ఉదయగిరి నుంచి నెల్లూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు నందిపాడు గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇచ్చేందుకు మార్జిన్ దిగింది. వర్షం కురుస్తున్నందున మార్జిన్ కుంగడంతో బస్సు అదుపుతప్పి ముళ్లచెట్లలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఇటీవల విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్ల కోసం రోడ్డు మార్జిన్ వెంట గుంతలు తీసి సక్రమ ంగా పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పలువురు అధికారులు

కావలి(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని నూతనంగా బాధ్యతలు చేపట్టిన పలువురు అధికారులు సోమవారం కావలిలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు. కావలి ఆర్డీవో ఎం. వంశీక్రిష్ణ ఎమ్మెల్యేను కలవగా రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే విద్యుత్‌శాఖ ఏడీఈగా రవికుమార్, కావలి సబ్ రిజిస్ట్రార్ సుమలత, డ్వామా పీడీ గంగా భవానీలు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

రేపు జాబ్ మేళా

కావలి టౌన్ (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎంప్లా యిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా బుధవారం పెద్దపవని వీసీయు పీజీ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ఆఫీసర్ అబ్దుల్ ఖయూమ్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ వినయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ మేళాలో ప్రముఖ కంపెనీలు నిర్వాహకులు పాల్గొని ఇంటర్వ్యూలు చేపడతారన్నారు. పాల్గొనదలిచిన అభ్యర్థులు ఆధార్ కార్డు జెరాక్స్, బయోడేటా, ఇతర ధృవీకరణ పత్రాలు వెంట తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్: 63015 43185, 72868 22789 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆవుదాడిలో గాయపడిన మహిళకు ఆర్థిక సాయం

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: మండలంలోని పీకే పాడులో ఇటీవల ఆవు దాడి చేయడంతో గాయపడిన నీరుకట్టు లక్ష్మమ్మకు హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం రూ. 10వేల ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వెంకటరమణారెడ్డి, బోమిళ్ల మురళి, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు



తీరప్రాంతాన్ని పరిశీలిస్తున్నతహసీల్దారు బాలకృష్ణారెడ్డి

ముత్తుకూరు(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : తీరప్రాంత గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు బాలకృష్ణారెడ్డి సూచించారు. సోమవారం ఆయన కృష్ణపట్నం సముద్ర తీర ప్రాంతాన్ని ఎంపీడీవో నాగమణితో కలిసి పరిశీలించారు. తీరం వెం బడి తుపాను ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. మత్స్యకారులు తాము చెప్పేంత వరకు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఇప్పటికే ఎవరైనా సముద్రంలో వేటకు వెళ్లి ఉంటే వెంటనే సమాచారం తెలిపి, తిరిగి వచ్చేయమని చెప్పాలన్నారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా, తక్షణం సమాచారం అధికారులకు తెలియజేయాలని కోరారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్‌తో ఎమ్మెల్సీ రుహుల్లా భేటీ



అజీజ్‌ను సన్మానిస్తున్ననూర్‌బాషా నాయకులు

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌గా నియమితుడైన టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ను ఎమ్మెల్సీ మొహమ్మద్ రుహుల్లా మర్యాదపూ ర్వకంగా కలిశారు. సోమవారం నెల్లూరులోని అజీజ్ నివాసానికి వచ్చిన రుహుల్లా పలు అంశాలపై చర్చించారు. కాగా, వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులైనందుకు అజీజ్‌ను నూర్‌బాషా సంక్షేమ సంఘం ఘనంగా స త్కరించింది. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు షేక్ కాలేషా, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ సలీమ్, నగర అధ్యక్షుడు హుసేన్‌సాహెబ్, నగర ప్రధాన కార్యదర్శి షేక్ మౌలాలీ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు : మంత్రి పొంగూరు

నెల్లూరు సాంస్కృతికం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా చర్య లు తీసుకుంటానని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. సోమవారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాల యంలో మంత్రిని జర్నలిస్టులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృతనిశ్చ యంతో ఉన్నామని, త్వరలోనే స్థల సేకరణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. నూతన ప్రెస్‌క్లబ్ నిర్మాణంకు చర్యలు చేపడతామని చెప్పారు.

నందంను కలిసిన చేనేత, పద్మశాలి సంఘం నాయకులు

నెల్లూరు వ్యవసాయం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద య్యని అఖిలభారత చేనేత విభాగం, పద్మశాలి సంఘం నాయకులు మంగళగిరిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అఖిల భారత చేనేత విభాగం జాతీయ అధ్యక్షుడు బూదాటి రాధయ్య, ఏపీ పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ సోమగోపాల్ పాల్గొన్నారు.

కౌలు భూములకు వేలం

తోటపల్లిగూడూరు(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : మండలంలోని సౌత్ ఆములూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ముంగల దొరువు, రాయతోపు శ్రీరంగనాథస్వామి ఆలయ మాగాణి భూముల కౌలుకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయానికి చెందిన 8 ఎకరాల 54 సెంట్లను కౌలుదారులు పాట ద్వారా ఏడాదికి రూ.85,400 కౌలు చెల్లించేలా దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో ఏ.శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ ఎం.సుధీర్, సిబ్బంది వి.దామోదర్, ఎల్.గోపాల్‌రెడ్డి. ఏ.అయోధ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలో రోడ్డుపై వర్షపునీటి మడుగు

ముంచెత్తిన వాన

● అల్పపీడన ప్రభావంతో రోజంతా వర్షం ● నగరంలో రోడ్లు, లోతట్టు జలమయం



నగరంలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

నెల్లూరు సిటీ(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడ ప్రభావంతో సోమవారం వేకువజాము నుంచి నెల్లూరు నగరం లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపి లేని వర్షాలకు నగరం తడిసి ముద్దయింది. వీధులు, ప్రధాన రహదారులు, కూడళ్లు వర్షపు నీటితో జలమ యంగా మారాయి. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శివారు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. చంద్రబాబునగర్, వైఎస్ నగర్, శ్రామికనగర్; శివాజీనగర్, చవటమిట్ట గిరిజన కాలనీలో వీధులు, ఖాళీ స్థలాలు నీటితో నిండాయి. లోతట్టులోని పలు ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. వర్షానికితోడు చలిగాలులు వీచడంతో జనజీవనానికి అసౌకర్యం కలిగింది. పేదలు, కూలీ లు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నగరంలోని అండర్‌బ్రిడ్జీల వద్ద వర్షపునీరు చేర డంతో నగర పాలక సంస్థ అధికారులు మోటార్లతో వాటిని తోడేశారు. గాంధీబొమ్మ, ఆర్టీసీ, వీఆర్సీ కూ డలి, కేవీఆర్ సెంటర్, పొగతోట, సంతపేట, వాకర్స్ రోడ్డు, బట్వాడిపాళెం కూడలి, సుబేదార్‌పేట, అయ్యప్పగుడి, వేదాయపాళెం సెంటరు, వనంతోపు వద్ద భారీగా వర్షపునీరు నిలిచింది. వ్యవసాయ పరిశోధన కేంద్రం వద్ద 83 మి.మీ., మున్సిపల్ కార్యాలయం వద్ద 56, పడారుపల్లి వద్ద 54, మాదరాజుగూడూరు వద్ద 63 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.



తల్పగిరి కాలనీలో చెరువులా మారిన ఖాళీ స్థలం

అప్రమత్తంగా ఉండాలి : కమిషనర్



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

భారీ వర్షాలు, విపత్తును ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. సోమవారం నగరంలోని లోతట్టు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. జాతీయ రహదారిపై కనుపర్తిపాడు జంక్షన్ వద్ద మేజర్ డ్రైన్ పూడిపోవడంతో ఎక్స్‌కవేటర్‌తో అడ్డంకులను తొలగించారు. వైఎస్‌నగర్‌లో, నగరంలోని అండర్ బ్రిడ్జిల వద్ద నిలిచిన వర్షపు నీటిని మోటర్ల సహాయంతో లోతేశారు. టైలర్స్ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, ఎంజీ మాల్ వద్ద కాలువల్లో నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. కేవీఆర్ సెంటర్, ట్రంకురోడ్డు, బ్రహ్మానంద పురం, ఫత్తేఖాన్‌పేట ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్, అక్కడ నీటి పారుదల కు నెలకొన్న అడ్డంకులను తొలగించే చర్యలు చేపట్టారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి విపత్తు ఎదురైనా నగర ప్రజలు వెంటనే కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం 0861-2356777, 2316777 నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

మినీబైపాస్ రోడ్డులో ఎమ్మెల్యే పరిశీలన

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నగరంలో మినీ బైపాస్ రోడ్డులోని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజల ఇబ్బందులు, అవసరాలను గుర్తించి వారికి సహాయంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు సూచించారు. అలాగే టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి 20, 21, 30వ డివిజన్లలో పర్యటించారు. అల్పపీడన నేపథ్యంలో వర్షప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు, పార్టీ శ్రేణులు అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.

పునరావాస కేంద్రాలు సిద్ధం చేయండి

● నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష



టీపీగూడూరు మండలం చింతోపు పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో అనూష

నెల్లూరు వెంకటేశ్వరపురం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వెంటనే పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష ఆదేశించారు. నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఇందుకూరుపేట, టీపీ గూడూరు మండలాల్లో ఆమె సోమవారం పర్యటించారు. పునరావాస కేంద్రాలను పరిశీలించి, ప్రజలకు కనీస వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రతీ మండల తహసీల్దారు కార్యాలయంలో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

కుండపోత వర్షం

● నిండుకుండల్లా కొన్ని చెరువులు
● పలు కాలనీల్లో నిలిచిన నీరు

వెంకటాచలం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తుఫాన్ ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు అప్రమత్తం చేయడంతో మండల అధికారులు గ్రామాల్లో పర్యటించి ముందస్తు చర్యలు చేపట్టారు. తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో కల్పన, సీఐ సుబ్బారావు ప్రజలను అప్రమత్తం చేశారు. అయితే అనికేపల్లి పంచాయతీ గొలగమూడి ఎస్సీ కాలనీలో మోకాటి లోతు వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీ వ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పం చాయతీ కార్యదర్శులు శివశంకర్, కల్పనలు అప్రమత్తమై టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, నాయకులు పార్థసారధినాయుడు, బోనిగల దా మోదర్‌లతో కలిసి ఎక్స్‌కవేటర్‌తో కాలువ తవ్వించి వర్షపునీరు ఎస్సీ కాలనీలో నిల్వకుండా చర్యలు చేపట్టారు. కొన్ని గ్రామాల్లోని లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిల్వగా అధికారులు చర్యలు చేపట్టారు. పలు చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి.



మనుబోలు : చంద్రమౌళీనగర్‌లో మాట్లాడుతున్న తహసీల్దారు

● బుచ్చిరెడ్డిపాళెంలో ..

బుచ్చిరెడ్డిపాళెం(ఆంధ్రజ్యోతి) : బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి వర్షం ఆగిపోయింది. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని చెన్నూరురోడ్డులో వర్షం నీరు మోకాటిలోతు నిలిచింది. అలాగే పెనుబల్లిలో ఎక్సకవేటర్‌తో దళిత, గిరిజన కాలనీల్లో నీరు నిల్వ చేరకుండా కాలువల్లో పూడికతీయించారు.

● అప్రమత్తంగా ఉండాలి

అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి తుపాను ప్రభావంతో ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు అన్నారు. ముందుగా ఆయన ఎంపీడీవో శ్రీహరి, నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర రెడ్డి, సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డితోపాటు అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. లోతట్టు ప్రాంతాలు, గిరిజన కాలనీలు, దళితవాడల్లో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన వారిని పునారావాస కేంద్రాలకు తరలించాలని తహసీల్దారు సూచించారు. అన్ని వసతులు కల్పిం చాలని ఆదేశించారు. అనంతరం పెన్నా పరివాహక ప్రాంతాల్లోని మినగల్లు, జొన్నవాడ, శ్రీరంగరాజపురం, దామరమడుగు పాతరస్తా, పల్లిపాళెం ప్రాం తాలు, పొర్లుకట్టలు, బాటలను వారు సందర్శించి అక్కడి ప్రజలతో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకుని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే నగర పంచాయతీలోని మలిదేవి కాలువ వెంబడి నివాసప్రాంతా లను నగర పంచాయతీ కమిషనర్ ఎల్. చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

● కోవూరులో భారీ వర్షం

కోవూరు(ఆంధ్రజ్యోతి) : కోవూరు మండలంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వల్ల పలుచోట్ల వీధులన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని శాంతినగర్, కోనేటియ్యాలు, లక్ష్మీనగర్, శివాజీనగర్, పీఆర్ఆర్ కాలనీ, ఎస్ఎస్ఆర్ కాలనీ, గుమ్మళ్లదిబ్బలోని వీధుల్లో వర్షపు నీరు చేరింది. మోడేగుంట, వేగూరు గ్రామాల్లో వర్షపునీరు ఎక్కువ సమయం నిలబడిపోయింది. భారీ వర్షం, తుపాను నేపథ్యంలో కాలువగట్లు, చెరువుకట్టలను నిత్యం పర్యవేక్షించాలని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దారు కార్యాలయంలో సీఐ సుధాకరరెడ్డి, ఎంపీడీవో సీహెచ్ శ్రీహరిరెడ్డి, తహసీల్దారు నిర్మలానందబాబా పలు శాఖల అధికారులతో సమీక్షించారు. లోతట్టుప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోమని తహసీల్దారు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.

● పొదలకూరులో...

పొదలకూరు(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంచాయతీ బస్టాండు, మెయిన్‌రోడ్డుపై వర్షపు నీరు రహదారులపై ప్రవహించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. పెన్నానదిలోకి ఎవరూ వెళ్లొద్దని సూచించారు. మరో మూడు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో మండల యంత్రాంగం అప్రమత్తమైంది.

● లోతట్టు కాలనీల గుర్తింపు

మనుబోలు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలకు నీట మునిగే 8 లోతట్టు కాలనీలను గుర్తించినట్లు తహసీల్దారు సీహెచ్.సుబ్బయ్య తెలిపారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో సోమవారం ఆయన మండలస్థాయి అధికారులతో సమీ క్షించారు. అనంతరం పలుకాలనీలకు వెళ్లి కాలనీవాసులతో మాట్లాడారు. ఏ సమయంలో ఆపదవచ్చినా తహసీల్దారు కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. మనుబోలు, బద్దెవోలు, కట్టువపల్లి, కొలనుకుదురు గ్రామాల కార్యదర్శులు, వీఆర్‌వోలు అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీడీవో జలజాక్షి కొలనుకుదురులో ఉన్న తుపాను షెల్టర్‌ను పరిశీలించారు. అలాగే తుపాను హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ. శివరాకేష్ సిబ్బందికి సూ చించారు. ప్రజలకు ఎక్కడ ఆపదకలిగినా వెంటనే అక్కడికి పోలీసులు చేరుని సేవలందించాలన్నారు. ఎక్కడ ప్రాణనష్టం కలగకుండా మనవంతు సాయం చేయగలగాలన్నారు.

● అధికారులతో సమీక్ష

సైదాపురం(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్ర భావంపై గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీవో పురుషోత్తం శివ కుమార్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ లో తట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం : గొలగమూడిలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న కాలువ



కోవూరు : కోర్టు ఎదురు వీధిలో రోడ్డుపై వర్షపునీరు

మెట్ల కింద పురిటిబిడ్డ మృతదేహం

నెల్లూరు క్రైం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: ఓ పసికందు మృతదేహాన్ని నగరంలోని రామ్‌నగర్‌లో సోమవారం రాత్రి పోలీసులు గుర్తించారు. పోలీసుల సమాచారం మేరకు.. రామ్‌నగర్ మూడో వీధిలోని విశ్రాంత పోలీసు అధికారి ఇంట్లో హుమేరా కుటుంబం నివసిస్తోంది. ఆమె అదే ప్రాంతంలోని ఓ హోటల్‌లో పనిచేస్తోంది. హోటల్‌లో ఒడిశాకు చెందిన తానుజాక్షితో పరిచయం ఏర్పడుతుంది. ఆమె గర్భవతి కావడంతో హుమేరా వద్దనే ఉంటోంది. హుమేరా రెండు రోజుల కిందట ఊరెళ్లగా తనుజాక్షి పాపకు జన్మనిచ్చింది. పాప పురిటిలోనే చనిపోయిందో మరే కారణమో తెలియదుగానీ పాపను గుడ్డలో చుట్టి మెట్ల కింద పడవేసి తనుజాక్షి ఎక్కడికో వెళ్లిపోయింది. సోమవారం రాత్రి మెట్ల కింద నుంచి దుర్వాసన వస్తుండటంతో హుమేరా 112 నెంబర్‌కు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి దర్గామిట్ట ఎస్ఐ రమేష్‌బాబు చేరుకొని పరిశీలించారు. పసికందు మృతదేహాన్ని గుర్తించి జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

ముందస్తు పారిశుధ్య పనులు

ముత్తుకూరు(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : భారీ వర్ష సూచన హెచ్చరికతో బ్రహ్మదేవం పంచాయతీలో అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. మూడు, నాలుగు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ప్రకటించడంతో టీడీపీ మండల నాయకులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులతో మాట్లాడి పంచాయతీ పరిధిలోని మురికి కాలువలను శుభ్రం చేశారు. కాలువల్లో పూడికతీసి వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు జాగ్రత్తలు తీసుకున్నారు. రోడ్డుకిరువైపులా విద్యుత్‌లైన్‌లపై పడుతున్న చెట్ల కొమ్మలను తొలగించారు. వర్షపు నీటి కారణంగా ఎక్కడ ఇబ్బదులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

నేడు ప్రదోషకాల అభిషేకం

నెల్లూరు సాంస్కృతికం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో మంగళవారం త్రయోదశి సందర్భంగా సాయంత్రం 5 గంటలకు ప్రదోషకాల అభిషేకాలు జరుగుతాయని ఆలయ ఈవో, సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూలస్థానేశ్వరస్వామికి, నందీశ్వరునికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు జరుగుతాయని, అనంతరం నంది వాహనంపై శివ పార్వతులకు ప్రాకారోత్సవం జరుగుతుందని, భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

పొదలకూరు రోడ్డుపై వాలిన చెట్లు

● పట్టించుకోని ఆర్‌అండ్‌బీ



ప్రమాదకరంగా రోడ్డుపై వాలిన చెట్లు

నెల్లూరు రూరల్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : రహదారులను రోడ్లు, భవనాల శాఖ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా పర్యవేక్షిస్తున్నారో ఈ రోడ్డును చూస్తే ఇట్టే తెలిసిపోతుంది. నెల్లూరు నుంచి పొదలకూరుకు వెళ్లే రహదారిపై దొంతాలి, ఆమంచర్ల మధ్య అనేక చెట్లు వాలి రోడ్డుపై పడిఉన్నాయి. వీటి వల్ల వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రాత్రుళ్లు దగ్గరకు వచ్చే వరకు రోడ్డుపై చెట్లు కనిపించకపోవడంతో స్కూటర్లు, కార్లు, జీపుల్లో ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలా ఆమంచ ర్లకు చెందిన పలువురు గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. రహదారిపై చెట్లు వాలడంపై రోడ్లు, భవనాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా పట్టించుకోవాలని కోరుతున్నారు.

కూటమి రాకతో పల్లెలకు పండగొచ్చింది

● టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

నెల్లూరు రూరల్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పల్లెటూళ్లకు పండగొచ్చిందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆమంచర్ల, దొంతాలి గ్రామాల్లో సోమవారం జరిగిన పల్లెపం డుగ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎంపీపీ విజయ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. డ్రైన్లు, సీసీరోడ్ల నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. సీఎం చంద్ర బాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పల్లెలకు మహర్దశ తీసుకువస్తున్నారని కొనియాడారు. మండలంలోని 18 గ్రామాల్లో రూ.2 కోట్లతో ప్రజలకు కనీస సదుపాయాలను సమకూర్చేలా పనులు నిర్వహించబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో శైలేంద్రకుమార్, సర్పంచి వెంకయ్యనాయుడు, నాయకులు వేణునాయుడు, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, సీడీపీవో లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
తిరుపతి
మంగళవారం 15 అక్టోబరు 2024

తుఫాన్ కంట్రోల్ రూములు

తిరుపతి కలెక్టరేట్ : 0877-2236007
గూడూరు సబ్ కలెక్టర్‌కార్యాలయం: 86242 52807
సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం: 86232 95345
తిరుపతి ఆర్డీవోకార్యాలయం: 86869 66559
శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం: 99665 24952



అప్రమత్తమైన టీటీడీ

ఇంకోవైపు టీటీడీ యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. ఘాట్ రోడ్లు దెబ్బ తినకుండా, రాళ్లు, బండలు విరిగిపడి వాహనాలు ప్రమాదానికిలోను కాకుండా ముందు జాగ్రత్తలన్నీ తీసుకుంటోంది. మంగళవారం వీఐపీల సిఫారసు లేఖలు కూడా తీసుకోరాదని, 16న వీఐపీ దర్శనాలు కూడా రద్దు చేయాలని నిర్ణయించింది.



కోట మండలం శ్రీనివాససత్రం సముద్రతీరంలో ఎగిసిపడుతున్న అలలు

వాన ముప్పు

తీరంలో రెడ్ అలర్ట్

భారీ వర్షాల హెచ్చరికలతో యంత్రాంగం అప్రమత్తం

తిరుపతి/తిరుపతి (కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా సోమవారం ఓ మోస్తరుగా వర్షం పడింది. మంగళవారం నుంచి భారీగా పడొచ్చని వాతావరణ హెచ్చరించింది. ఈ క్రమంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సముద్ర తీర ప్రాంతాలైన కోట, వాకాడు, చిల్లకూరు మండలాలపై ప్రత్యేక దృష్టి సారించింది. తీర ప్రాంత గ్రామాల్లో అధికారులు సోమవారం పర్యటించారు. పరిస్థితిని పరిశీలించి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళకుండా సూచనలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. తుఫాను షెల్టర్లను, ఇతర పునరావాస కేంద్రాలను పరిశీలించి.. సిద్ధం చేస్తున్నారు. రిజర్వాయర్లు, చెరువులు, కాలువలు, కాజ్‌వేలను పరిశీలించారు. రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వ స్థాయిలను గుర్తించారు. అన్ని జలవనరుల వద్దా కాపలా ఏర్పాటు చేశారు. ప్రమాదకర పరిస్థితులున్న చోట్ల, కాజ్‌వేల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచుతున్నారు. 2021నాటి వరదల అనుభవంతో ముందు జాగ్రత్త చర్యలన్నీ తీసుకుంటున్నారు. పోలీసు, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, విద్యుత్, వైద్యారోగ్య శాఖ, పౌరసరఫరాలు వంటి కీలక శాఖలను కలెక్టర్ అప్రమత్తం చేశారు. ఇప్పటికే ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గూడూరు చేరుకున్నాయి. వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు. మంగళవారం ఉదయం వాన పరిస్థితిని బట్టి సెలవుపై నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు చెప్పారు.

తడలో 77.2 మి.మీ. వర్షం

జిల్లాలో సోమవారం అత్యధికంగా తడలో 77.2మి.మీ. నమోదైంది. మండలాల వారీగా.. సూళ్లూరుపేట 54.2, వరదయ్యపాళెం 53.4, ఏర్పేడు 45, బుచ్చినాయుడుకండ్రిగ 41.2, దొరవారి సత్రం 40.6, చిట్టమూరు 38.4, శ్రీకాళహస్తి 36.2, చిల్లకూరు 34.6, వాకాడు 33.8, గూడూరు 32.4, వెంకటగిరి 31.4, తిరుపతి రూరల్ 30.8, రామచంద్రాపురం 30, తొట్టంబేడు 29.5, ఓజిలి 27.2, నాయుడుపేట 26.2, పెళ్లకూరు 25.2, కేవీబీపురం 24.8, రేణిగుంట 24.2మి.మీ చొప్పున వర్షం పడింది.

జిల్లా అధికారులకు సీఎం దిశానిర్దేశం

భారీ వర్ష సూచన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. సోమవారం ఆయన టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. మానవ, పశు ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా చూడాలన్నారు. ఎప్పటికపుడు తుఫాను సమాచారాన్ని మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేయాలన్నారు. మంగళవారం నుంచి వర్షప్రభావం ఎక్కువగా ఉంటుందని, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు.

సముద్రంలో అలల ఉధృతి



● చేపల వేట ఆపేయడంతో ఒడ్డుకు చేరిన పడవలు

కోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగండం ప్రభావంతో ఇప్పుడిప్పుడే సముద్రంలో అలల ఉధృతి పెరుగుతోంది. మూడు రోజులపాటు భారీ వర్ష సూచన.. అధికారుల హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సోమవారం చేపల వేట నిలిపేశారు. దీంతో సముద్రంలో నుంచి పడవలు, వలలు, ఒడ్డుకు చేరాయి. సముద్రతీర ప్రాంత గ్రామాల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించారు. ఇక, సోమవారం తెల్లవారుజాము నుంచే గోవిందపల్లి పాళెం, శ్రీనివాససత్రం, కొత్తపట్నం, సముద్రపు వెంబడి గ్రామాల్లో ఈదురుగాలులు, ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. వాయుగుండం ఎక్కడ అల్పపీడనంగా మారి తీవ్ర తుఫాను వల్ల నష్టపోతామోనని కోట, చిట్టమూరు, వాకాడు మండలాల ప్రజలు ఆదోళన చెందుతున్నారు.

పులికాట్‌కు జలకళ



సూళ్లూరుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నిన్న, మొన్నటి వరకు నీరులేక ఎడారిని తలిపించిన పులికాట్ సరస్సు బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సోమవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షంతో జలకళ సంతరించుకొంది. వర్షంతో పాటు మధ్నాహ్నం నుంచి తేలికపాటి ఈదురు గాలులు తోడవ్వడంతో సరస్సులోకి ఎగువ ప్రాంతం నుంచి కూడా నీరుచేరింది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో కుదిరి, అట్టకానితిప్ప వద్ద సరస్సులో అలల ఉధృతి సముద్రాన్ని తలపిస్తోంది. పులికాట్ జలకళ రావడంతో పాటు తీరం వెంబడి చల్లని గాలులతో కూడిన వాతావరణం ఉండడంతో జాలర్లు చేపల వేట సాగిస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో

స్థానికులకు టైంస్లాట్

శ్రీకాళహస్తి, అక్టోబరు 14: శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్థానిక భక్తులకు దర్శనానికి సంబంధించి ప్రత్యేక టైంస్లాట్ కేటాయిస్తూ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6 నుంచి 7.30గంటల వరకు సాయంత్రం 7నుంచి 8.30గంటల వరకు స్థానికులు ముక్కంటి ఆలయంలో కంచుగడప నుంచి ఎలాంటి టిక్కెట్టు లేకుండా ప్రవేశించే విధంగా టైంస్లాట్ అమలు చేయనున్నట్టు ఈవో పేర్కొన్నారు. నాల్గో గేట్‌లోని పీఆర్వో కార్యాలయం వద్ద ఆధార్ కార్డుతో నమోదు చేసుకున్న స్థానిక భక్తులను కంచుగడప వద్ద అనుమతించనున్నారు. ప్రస్తుతం నాల్గో గేట్‌లో పీఆర్వో కార్యాలయం ఉంది. అయితే స్థానిక భక్తుల కోసం 1వ గేటు వద్ద మూడు రోజుల్లో అదనపు పీఆర్వో కార్యాలయం ఏర్పాటు చేస్తామని ఈవో తెలిపారు.

ఆధార్‌తో దర్శనాలా..?

స్థానిక భక్తులకు ఆధార్‌కార్డుతో శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనం చేసుకునేలా నిర్ణయం సరికాదని ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు చిట్టివేలు జయగోపాల్ అన్నారు. స్థానిక భక్తులు ఉదయం నుంచి రాత్రి ఏకాంత సేవ వరకు వస్తుంటారన్నారు. మహిళలు, వృద్ధులు తమ ఆధార్ కార్డును దక్షిణ గోపురం వద్ద ఉన్న పీఆర్వో కార్యాలయంలో చూపించి స్లిప్పు తీసుకుని మళ్లీ స్వామిఅమ్మవార్ల దర్శనానికి కంచు గడప వద్ద సాధారణ క్యూలైన్‌లో పంపంచే నిర్ణయం సరికాదన్నారు. దీని వలన ఆలయానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించి ఈ నిర్ణయం పునఃసమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు.

కిక్కు వీరికే..!



● 3920 దరఖాస్తులకు 5 గంటల్లో ముగిసిన ప్రక్రియ

● లాటరీ తీసి 227 మద్యం దుకాణాల కేటాయింపు

16 మంది మహిళలకు షాపులు



షాపులు దక్కిన వేళ..



డిప్ తీసి నెంబరు చూపుతున్న కలెక్టరు వెంకటేశ్వర్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్న 3920 మందిలో లక్కు ఎవరికన్నది తేలిపోయింది. లాటరీ ద్వారా సోమవారం 227 మద్యం దుకాణాలను కేటాయించారు. తిరుపతిలోని శిల్పారామంలో కలెక్టర్ వెంకటేశ్వర్ సమక్షంలో లైసెన్సుల జారీకి లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. లాటరీ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాలి. అయితే, సీఎం టెలికాన్ఫరెన్సులో కలెక్టర్ బిజీగా ఉండటంతో 8.55 గంటలకు వచ్చాక ప్రారంభించారు. ఆ తర్వాత 3920 దరఖాస్తుల్లో జిల్లా గెజిట్‌లో ప్రచురించిన దుకాణాల క్రమ సంఖ్య ప్రకారం లాటరీ తీసి దుకాణాలు దక్కించుకున్న వారి పేర్లను ప్రకటించారు. తొలుత తిరుపతి అర్బన్‌లో 32 దుకాణాలకు సంబంధించిన దరఖాస్తుదారులను హాలులోకి రప్పించారు. ఏ దుకాణానికి ఎంతమంది దరఖాస్తు చేశారనే వివరాలను డిజిటల్ బోర్డులో డిస్‌ప్లే చేశారు. అనంతరం డిప్ తీశారు. ఇలా తిరుపతి డివిజన్‌లోని ఆరు మండలాలకు సంబంధించి మధ్యాహ్నం 12 గంటలకు.. 12 గంటల నుంచి గూడూరు డివిజన్‌లోని ఐదు మండలాలకు.. చివరగా మధ్యాహ్నం రెండు గంటలకు వెంకటగిరి మండలానికి సంబంధించి డిప్ తీసి లైసెన్సుదారులను ప్రకటించడంతో ఈ ప్రక్రియ ముగిసింది. ఇలా 227 మందికి దుకాణాల లైసెన్సులు కేటాయించారు. దాదాపు 4200 మంది హాజరయ్యారు. జేసీ శుభం బన్సాల్, ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దుకాణానికి ముగ్గురి ఎంపిక

లాటరీ ద్వారా దుకాణం దక్కించుకున్న అతడితో పాటు రిజర్వులో మరో ఇద్దరి పేర్లు కూడా ఎంపిక చేసి ప్రకటించారు. ఒక వేళ మొదటి లైసెన్సుదారుడు సకాలంలో ఫీజు చెల్లించకుంటే రిజర్వులో ఉన్న వారికి అవకాశం ఇస్తారు. ఈ లైసెన్సు ఫీజును ఆరు కంతుల్లో చెల్లించాలి. దీని కోసం లాటరీ తీసే హాలు వద్ద బ్యాంకర్లు కౌంటర్లు ఏర్పాటు చేశారు. తొలి రోజు మొదటి కంతు నగదు చెల్లించి లైసెన్సు పొందాలి. కాగా, 163 మద్యం షాపులు రూ.65 లక్షల శ్లాబులోను.. మరో 64 మద్యం దుకాణదారులు రూ.55 లక్షల శ్లాబులో ఉన్నారు. వీరంతా తొలికంతు నగదు కట్టి లైసెన్సు పొందారు. ఇప్పటికే, దరఖాస్తు ఫీజు కింద రూ.రెండు లక్షల చొప్పున 3920 మంది రూ.78.40 కోట్లు చెల్లించారు.

మహిళలకు మద్యం షాపులు

227 దుకాణాలకుగాను 75 మంది మహిళలు దరఖాస్తు చేశారు. వీరిలో 16 మందికి లాటరీ ద్వారా మద్యం దుకాణాలు దక్కాయని ఎక్సైజ్ అధికారులు చెప్పారు.

ఆగండి.. అన్నతో మాట్లాడి చెబుతా

తిరుపతి రూరల్ పరిధిలోని 12 దుకాణాలకుగాను తిరుచానూరు వారికి ఏడు దక్కాయి. వీరు లైసెన్సు ఫీజు చెల్లించడానికి కౌంటర్ వద్దకు వెళ్లగా.. 'కాసేపు ఆగండి. అన్నతో (ఒక ప్రజాప్రతినిధి) మాట్లాడి చెబుతా'నంటూ అక్కడ డ్యూటీలో ఉన్న ఓ ఎక్సైజ్ సీఐ హుకుం జారీ చేశారు. అక్కడే ఉన్న మరో ఎక్సైజ్ సీఐ వారికి సర్ది చెప్పడంతో ఎలాంటి వివాదానికి దారి తీయలేదు. ఈ విషయం ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అలాంటిది జరగడానికి అవకాశం లేదన్నారు. దీనిపై పరిశీలిస్తానన్నారు.



మద్యం షాపులు దక్కించుకున్నాక అక్కడే కౌంటర్లలో డబ్బు కడుతున్న దృశ్యం

పారదర్శకంగా ప్రక్రియ

డిప్ ద్వారా 227 మద్యం దుకాణాలను పారదర్శకంగా కేటాయించామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. లక్కీ డిప్ ముగిశాక ఆయన మీడియాతో మాట్లాడారు. లైసెన్సుదారులు బుధవారం నుంచి మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారన్నారు. మంగళవారం నుంచి స్టాకు తీసుకెళ్లాలని సూచించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ సహకారంతో పారదర్శకంగా మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ పూర్తి చేశామని ఎక్సైజ్ సూపరిటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి చెప్పారు. ఈ మీడియా సమావేశంలో ఏసీ శ్రీనివాసాచ్చారి, ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి, ఏఈఎస్‌లు వాసుదేవ చౌదరి, ఊహశ్రీ, ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు, ఎన్‌ఫోర్సుమెంటు ఎస్ఐ స్వామినాథన్, సిబ్బంది పాల్గొన్నారు.



గూడూరు మండలం కొండాగుంటలో సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

రూ.154 కోట్లతో పల్లె పండుగ

● తొలిరోజు 54 పనులకు శంకుస్థాపన

తిరుపతి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం 'పల్లె పండుగ' మొదలైంది. వర్షం కారణంగా చంద్రగిరి, సూళ్లూరుపేటలో తొలిరోజు కార్యక్రమాలు చేపట్టలేదు. శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో 54 అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు జరిగాయి. గ్రామాల్లో అభివృద్ధి పనులకు జోరుగా శంకుస్థాపనలు చేపట్టాల్సి వుండగా వానలు, ఈదురు గాలుల ప్రభావంతో చాలాచోట్ల కార్యక్రమాలు జరగలేదు. గత ఆగస్టు 23న జిల్లావ్యాప్తంగా 774 పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులపై తీర్మానాలు చేసిన విషయం తెలిసిందే. ఆ క్రమంలో జిల్లాకు ప్రభుత్వం రూ. 154.40 కోట్లు కేటాయించింది. ఇప్పుడు 'పల్లె పండుగ' పేరుతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. డిప్ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియలో పాల్గొన్న కారణంగా కలెక్టర్ వెంకటేశ్వర్ పల్లె పండుగలో పాల్గొనలేకపోయారు. ఈనెల 20వ తేదీ వరకూ ఈ కార్యక్రమం జరగాల్సి ఉంది. కాగా, 17 వరకు భారీ వర్ష హెచ్చరికల నేపథ్యంలో మూడు రోజుల పాటు పల్లె పండుగ కార్యక్రమం చురుగ్గా కొనసాగే పరిస్థితి కనిపించడం లేదు.



ఒకవైపు వర్షం. మరోవైపు అర కి.మీపైగా క్యూలైను. ఇలా నగరిలో సోమవారం ఇండేన్ గ్యాస్ సిలిండర్లు తీసుకోవాల్సి వచ్చింది. నగరి, నిండ్ర, విజయపురం మండలాల పరిధిలోని 7500 మంది వినియోగదారులు తరచూ ఇలా అవస్థలు పడుతూనే వున్నారు. అధికారులకు చెబితే సిలిండర్లు సక్రమంగా రాకపోవడంతో తామేమి చేయలేకపోతున్నామని చెబుతున్నారని వినియోగదారులు అంటున్నారు.

- నగరి, ఆంధ్రజ్యోతి



తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనార్థం సోమవారం వచ్చిన కర్ణాటక భక్తురాలు మమతా ఆనంద్ క్యూలైన్‌లో హ్యాండ్ బాగ్ పోగొట్టుకున్నారు. ఇది మరో భక్తురాలికి దొరికింది. దర్శనం తరువాత హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదని బాధితురాలు విజిలెన్స్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ద్వారా ఆ బ్యాగు తీసుకున్న మహిళను గుర్తించి ఇప్పించారు. అందులో రూ.54.200నగదు, బ్యాంకు కార్డులు ఉన్నాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



తమ వీధిలో మద్యం దుకాణం వద్దని పాత బలరాం థియేటర్ వీధివాసులు ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. గతంలో బలరాం థియేటర్ మార్గంలో మద్యం దుకాణం ఉండేదని దాన్ని తొలగించాలంటూ పోరాటం చేశామన్నారు. హైకోర్టు ఆదేశాలతో దుకాణాన్ని తొలగించినట్లు తెలిపారు. అయితే మళ్లీ ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



తిరుపతి రుయాస్పత్రిలో పురిటి బిడ్డలకూ అవస్థలు తప్పడం లేదు. ప్రసూతి ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ లేదు. దీంతో అక్కడి పిల్లలను రుయా ఏడీ భవనంలో ఉన్న కేంద్రానికి తీసుకొస్తున్నారు. ఇక్కడ సాధారణ, అత్యవసర చికిత్స పొందే రోగులతోపాటు శిశువులకూ స్కానింగ్ చేయాల్సి రావడంతో, గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. పురిటి బిడ్డలుండే వార్డులోనే స్కానింగ్ ఏర్పాటుపై అధికారులు పట్టించుకోవడం లేదు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

మన సంపద

దొంగలమండపం



కరకంబాడి రోడ్డులో అన్నమాచార్య కాలేజీ వెనుక వెంకటాపురం చెరువులో ఈ పురాతన మండపం కనిపిస్తుంది. ఎవరు కట్టించారో, ఏ కాలంనాటిదో గానీ శిల్పశోభితమైన రాతి స్తంభాలతో, దూలాలతో శిథిలస్థితిలో ఉంది. శ్రీరాముడు, మురళీకృష్ణుడు, శ్రీ వేంకటేశ్వరుడు, బలరాముడు, ఆంజనేయస్వామి, గరుడ, నటరాజ వంటి దేవతామూర్తుల బొమ్మలు, శంఖు, చక్రం, నామం, పద్మాకృతులు ఈ మండపం స్తంభాలమీద ఉన్నాయి. 16 స్తంభాల్లో ఒకటి కూలిపోయింది. పైన మొలచిన మొక్కలు వృక్షాలుగా మారి మండపం బీటలువారింది. దీన్ని ఈ ప్రాంతంలో దొంగలమండపం అని పిలుస్తారు. ఊరికి దూరంగా విసిరేసినట్లు ఉండే ఈ మండపంలో ఒకప్పుడు దొంగలు తలదాచుకునేవారని అంటారు. నిజానికి ఇది తిరుమల కొండకు కాలినడకన దూరప్రాంతాల నుంచీ వచ్చే భక్తులు సేదదీరేందుకు విజయనగర కాలంలో నిర్మించిన దారి మండపం కావచ్చు.



పురాతన చరిత్రక సంపద పట్ల మన నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నట్టుగా అలనాటి వైభవానికి శిథిలసాక్ష్యంగా ఇప్పుడు కనిపిస్తోంది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి





హత్యకేసులో నిందితుడి లొంగుబాటు



నిందితుడిని చూపుతున్న సీఐ కిషోర్‌బాబు

చిల్లకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తొణుకుమాల సమీపంలో ఇటీవల జరిగిన వెంకటేశ్వర్లు హత్య కేసులోని నిందితుడు అంకయ్య సోమవారం లొంగిపోయినట్లు సీఐ కిషోర్‌బాబు సోమవారం తెలిపారు. డక్కిలి మండలం దగ్గవోలు గ్రామానికి చెందిన అంకయ్య అతడి భార్య లక్ష్మమ్మ, సైదాపురం బీసీ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు, అతని భార్య సుబ్బమ్మ తొణుమాల సమీపంలోని అరుణమ్మకు చెందిన మామిడి తోటలో కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవారు. మద్యానికి బానిసలై జల్సాలకు అలవాటుపడి వీరు పొలాల్లో విద్యుత్‌మోటారు వైర్లను చోరీ చేసి విక్రయించేవారు. సెప్టెంబరు 9వ తేదీ రాత్రి మోటారు చోరీ చేసి, అందులోని వైరును పంచుకునే విషయంలో అంకయ్య, వెంకటేశ్వర్లుకు మధ్య వివాదం ఏర్పడింది. అంకయ్య గడ్డపారతో దాడి చేయడంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని మామిడి తోటకు సమీపంలోని తెలుగుగంగ కాలువ కట్టపై పూడ్చిపెట్టి అంకయ్య పరారయ్యాడు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అంకయ్య సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద అధికారుల సమక్షంలో లొంగిపోయినట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేష్‌బాబు, సిబ్బంది ఆర్‌వీ రాజు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

తడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అపాచీలో కార్మికురాలి హత్య కేసులో నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. చిట్టమూరు మండలం కుమ్మరిపాళెం గ్రామానికి చెందిన గొంజి వనజ అపాచీ పరిశ్రమలో పనిచేస్తుండేది. గత శుక్రవారం విధుల్లో ఉన్న ఆమెను.. అదే గ్రామానికి చెందిన మీజూరు సురేష్ కత్తెరతో దాడిచేసి హత్యచేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పరారీలో ఉన్న సురేష్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనపరచిన ఎస్‌ఐ కొండపనాయుడు, సిబ్బందిని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ అభినందించారు. రివార్డు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.

ఘాట్‌రోడ్డులో అదుపుతప్పిన కారు



తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో సోమవారం సాయంత్రం ఓ కారు అదుపు తప్పింది. అదృష్టవశాత్తు కారులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. తమిళనాడుకు చెందిన ఓ భక్తబృందం శ్రీవారి దర్శనం ముగించుకుని తమ కారులో సోమవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఈమేరకు మార్గంలోని వినాయకస్వామి ఆలయం వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పి కుడివైపునున్న చిన్నపాటి గట్టును ఢీకొని ఆగిపోయింది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. కారులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

ఉత్తమ సేవకులకు ప్రశంసా పత్రాలు, రివార్డులు



ఎస్పీ చేతుల మీదుగా రివార్డులు అందుకుంటున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు విలువైన సేవలందించిన పోలీసు అధికారులు, సిబ్బందిని సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వారికి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, నాగభూషణరావు, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, సాయుధ దళం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

విపత్తును ఎదుర్కొనేలా సంసిద్ధంకండి

- టీటీడీ అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో విపత్తులను ఎదుర్కొనేలా సంసిద్ధంగా ఉండాలని టీటీడీ అధికారులను ఈవో శ్యామలరావు ఆదేశించారు. విపత్తు నిర్వహణ ప్రణాళికపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి సోమవారం ఆయన అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. 2021లో భారీ కొండ చరియలు విరిగి పడిన ఘటనతో టీటీడీ 700 పేజీల విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈప్రణాళికను మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈవో స్థాయిలో విపత్తుల నివారణ ఎగ్జిక్యూటివ్ కమిటీ, అదనపు ఈవో ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ సమన్వయ కమిటీ ఉందన్నారు. అగ్నిమాపక శాఖ, ఆరోగ్యశాఖ, విజిలెన్స్ విభాగం, ఇతర కీలకమైన శాఖల విభాగాధిపతులు, తమ సిబ్బందితో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొండ చరియలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఘాట్‌రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. జనరేటర్లు నడపడానికి ముందస్తు జాగ్రత్తగా తగినంత డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఐటీ విభాగం కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అంబులెన్సులను అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం డ్యామ్ గేట్లను పర్యవేక్షించాలన్నారు. ఘాట్‌రోడ్డుల్లో ఎక్స్‌కవేటర్లు, ట్రక్కులు, ట్రాక్టర్లు, తగిన సిబ్బందిని సంసిద్ధంగా ఉంచుకుని సమాయత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇంజినీరింగ్ సిబ్బందిని సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఇతర అధికారులు, జిల్లా పోలీసుల, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే పోలీసులకూ సమాచారం ఇవ్వండి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న క్రమంలో పోలీసులు అప్రమత్తంగా వుండాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం డయల్ 112, లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 80999 99977కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. రైల్వే అండర్ బ్రిడ్జిల కింద వెళ్ళకూడదని, పాత భవనాల్లో వుండే వాళ్ళు వెంటనే ఖాళీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

తిరుపతి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో వరద ముంపు ప్రాంతాల ప్రజలకోసం పునరావాస కేంద్రాలను అధికారులు సోమవారం పరిశీలించారు. పేరూరు హరిపురం కాలనీలోని శ్రీచైతన్య స్కూల్, వెంకటపతి నగర్‌లోని పాఠశాలను తహసీల్దారు రామాంజులనాయక్, ఎంపీడీవో రామచంద్ర సందర్శించారు. భారీ వర్షాలు కురిస్తే వీటిలో రిహాబిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు సూచనలు చేశారు.

కరెంటు సరఫరా పర్యవేక్షణకు

నోడల్ ఆఫీసర్లు

- డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూములు
- సీఎండీ సంతోషరావు వెల్లడి

తిరుపతి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికలతో సదరన్ డిస్కం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎండీ కె.సంతోషరావు ఆదేశించారు. డిస్కం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. సర్కిల్, డివిజన్ల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలను తాకవద్దని, కరెంట్ లైన్ల కింద నిలబడవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ స్తంభాలు కూలినా.. తీగలు తెగినా తక్షణమే సమీప అధికారులకు, సిబ్బందికి సమాచారమివ్వాలని కోరారు.

కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుపాను ప్రభావం అధికంగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం 33కేవీ ఆర్డీవో ఆఫీస్ సబ్‌స్టేషన్, న్యూమారుతీనగర్, ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ చంద్రశేఖర్‌రావు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కరెంటు సమస్యా.. ఫోను చేయండి

టోల్‌ఫ్రీ నెంబరు: 1912-1800425155333

వాట్సాప్ నెంబరు: 91333 31912

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.56 కోట్లు

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.2.56 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 86,900 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,739 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

17 నాటికి విజన్ డాక్యుమెంట్ సిద్ధం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఈనెల 17 నాటికి సిద్ధమవుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ వర్చువల్ విధానంలో కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ వివరిస్తూ రాబోయే ఐదు సంవత్సరాలకు సంబంధించిన మండల విజన్ డాక్యుమెంట్ పూర్తయిందన్నారు. జిల్లా విజన్ డాక్యుమెంట్ పురోగతిలో ఉందని, 17వ తేదీ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

రేపు రుయాలో పాలియేటివ్ కేంద్రం ప్రారంభం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రుయాస్పత్రిలో బుధవారం 10 పడకలతో ప్రత్యేక పాలియేటివ్ (ఉచిత ఉపశమన సంరక్షణ) కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నామని సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. రోటరీ క్లబ్ సహకారంతో ఈ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయమై ఆయన సోమవారం రోటరీ క్లబ్ నిర్వాహకులతో సమీక్షించారు. ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని, వృద్ధులు, క్యాన్సర్ బాధితుల కోసం దీన్ని ప్రారంభిస్తున్నా మని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు

నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌కు తిరుపతికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. రాజమండ్రిలో ఇటీవల జరిగిన సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 18, 16, 14విభాగాలలో బి.గణేష్‌ప్రియవర్ధన్(డిస్కస్‌త్రో), బి.ప్రణీత్‌కుమార్, కె.హరిచరణ్(షాట్‌పుట్), బి.శర్మి(ట్రైయాథిలాన్) ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా తరఫున ఎంపికయ్యారు. వీరు ఈనెల 17నుంచి 19వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే 35వ సౌత్‌జోన్ నేషనల్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొంటారు. అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గిరిధర్‌రాజు, రాబర్ట్ వారిని అభినందించారు.

అప్రమత్తంగా ఉండండి

కాలువలపై అక్రమ నిర్మాణాలు తొలగించండి



తిరుపతి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం పడడంతో అధికారులతో కలసి నగరంలో పలుచోట్ల ఆమె పర్యటించారు. పేరూరు చెరువు నుంచి నీరువచ్చే ప్రాంతాలు, కపిలతీర్థం, మాల్వాడి గుండం నుంచి నీరు వెళ్లే ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, గొల్లవానిగుంట, జీవకోన ప్రాంతాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాబోయే రెండు రోజుల్లో వర్ష సూచన ఎక్కువగా ఉందని, నీరు నిలబడకుండా, రోడ్డుపైకి రాకుండా ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలన్నారు. కాలువలపై అక్రమ నిర్మాణాల తొలగింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పాన్ చెరువులో అక్రమంగా నిర్మాణాలు ఉన్నాయని చెప్పడంతో పరిశీలించారు. సర్వే చేసి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఆర్డీవో రామ్మోహన్, ఎస్ఈ శ్యాంసుందర్, ఇరిగేషన్ ఎస్ఈ శివారెడ్డి, అర్బన్, రూరల్ తహసీల్దార్లు భాగ్యలక్ష్మి, రామాంజుల నాయక్, ఎంఈలు తులసీకుమార్, గోమతి తదితరులు ఉన్నారు.

- హెల్ప్‌లైన్‌ను సద్వినియోగం చేసుకోండి

వర్షాల వల్ల ఏదైనా ఇబ్బంది కలిగితే 0877 2256766 హెల్ప్‌లైన్ నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కమిషనర్ కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటరును ఆమె పరిశీలించారు.

వెంకన్న భక్తులకు మెరుగైన సేవలు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మెరుగైన సేవలందించామని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీ, పోలీసు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కార్మికుల సమష్టి కృషితో ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం వచ్చిందని తెలిపారు. గరుడసేవ రోజున చిన్నపాటి పొరపాటు లేకుండా ప్రశాంతంగా ట్రాఫిక్ నడిచిందని గుర్తు చేశారు. అన్ని విభాగాల సమష్టి కృషి ఫలితంగానే బ్రహ్మోత్సవాలు విజయవంత మయ్యాయని పేర్కొన్నారు. సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఆటో బోల్తా: ఒకరికి గాయాలు



ప్రమాదంలో స్థలంలో వెంకటేశ్వర్లు

బాలాయపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలం చుట్టి బస్‌షెల్టర్ సమీపంలో సోమవారం ప్రమాదశావత్తు ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు కథనం మేరకు... గూడూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన పట్టపు వెంకటేశ్వర్లు తిరుపతికి వెళ్లి ఆటోలో తిరిగి వస్తుండగా మన్నూరు మలుపు దాటాక చుట్టి బస్సు షెల్టర్ సమీపంలో గేదె అడ్డు రావడంతో బోల్తా పడింది. వెంకటేశ్వర్లు ఆటో కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వెంకటేశ్వర్లును ప్రైవేటు వాహనంలో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువులకు సమాచారం ఇచ్చారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య




రాజేంద్ర (ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం రైల్వేగేట్ సమీపంలో సోమవారం ఉదయం మండలంలోని కట్టువపల్లి గ్రామానికి చెందిన ఈదూరు రాజేంద్ర(33) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఉదయం 7 గంటల సమయంలో రైల్వేగేటు వంతెనకు సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు కింద రాజేంద్ర పడుకోవడంతో తల, మొండెం రెండుగా తెగిపోయాయి. మృతదేహం వద్ద ఉన్న సెల్‌ఫోన్, ఆధార్ కార్డుల ఆధారంగా కట్టువపల్లి గ్రామానికి చెందిన రాజేంద్రగా రైల్వే సిబ్బంది గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సూళ్లూరుపేట రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడుకి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. రాజేంద్రకు కొంత కాలంగా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

చెంగాళమ్మ ప్రసాదంలో కొరవడిన నాణ్యత

సూళ్లూరుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చెంగాలమ్మ ఆలయంలో పాలన గాడి తప్పింది. పాలకవర్గం లేకపోవడంతో కొందమంది ఉద్యోగులు ఆడింతే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది. ఆలయంలో తయారు చేసే ప్రసాదంలో నాణ్యత లేదని భక్తుల నుంచి విమర్శలు వస్తున్నా దేవదాయశాఖ అధికారుల్లో చలనం లేదు. ఇంట్లో జరిగే వేడుకలకు ఏదైన ఫలహారాలు చేయాలంటే ఒకటికి పదిసార్లు పరిశీలించి, రుచిచూసి తయారు చేస్తాం. అయితే వందలాది మంది భక్తులకు ఇచ్చే దేవుడి లడ్డు, పులిహోర తదితర వాటిల్లో నాణ్యత నేతిబీర చందంగా మారింది. పాలకవర్గం లేకపోవడంతో ఆలయంలో కాంట్రాక్టు ఉద్యోగులదే హవాగా ఉంది. ఆలయం వద్ద కౌంటర్‌లో 80గ్రాముల లడ్డు



మరుగుదొడ్డిలో రూంలో లడ్డూలు తయారు చేసే పాత్రలు



లడ్డూలను ఆరుబయటే ఆరబెట్టిన దృశ్యం - పులిహోర ప్యాకెట్లు

రూ.15, 150 గ్రాముల పులిహోర రూ.10కు విక్రయిస్తున్నారు. లడ్డులో నాణ్యత లేదని, పులిహోర ప్రసాదంలో ఇసుక, సన్నరాళ్లు వస్తున్నాయని భక్తులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా పులిహోర తయారీకి వినియోగించే చింతపండులో నాణ్యత లేదు. నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఆలయాల్లో ప్రసాదాలు ప్రత్యేక వంటశాలలో తయారు చేయాలి. చుట్టుప్రక్కల పరిసరాలు శుభ్రంగా ఉండాలి. చెంగాలమ్మ ఆలయంలో ప్రసాదం తయారీ చేసే పరిసరాలు శుభ్రంగా లేవు. ప్రసాదాలు తయారీకి వినియోగించే పాత్రలను మరుగుదొడ్డిలో శుభ్రం చేస్తున్నారు. ఆలయ అధికారులు తయారు చేసి ఇచ్చిందే మహాప్రసాదంగా భక్తులు తీసుకోవాల్సి వస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూజా సామగ్రి అధిక ధరకు విక్రయం

ఆలయ ఆవరణలోని దుకాణాల్లో అమ్మవారికి పూజకు వినియోగించే పూజా సామగ్రి, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిళ్లు, క్యాన్లను కాంట్రాక్టు దక్కించుకొన్న వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పూజా సామగ్రిలో కొబ్బరికాయ, అగర్‌వత్తులు, నిమ్మకాయ, తమలపాకు వక్కలు, పసు, కుంకం కలిపి రూ.50కి విక్రయించాల్సి ఉంది. అయితే దుకాణ దారులు రూ.60 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. అదే విధంగా కూల్ డ్రింక్స్, వాటర్ బాటిళ్లు, క్యాన్‌లు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఆలయ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని భక్తులు విమర్శిస్తున్నారు.

అత్త, మామలపై అల్లుడి దాడి



గాయపడిన ధనలక్ష్మి, కృష్ణారావు

గూడూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆస్తి విషయమై వివాదం చెలరేగడంతో అత్త, మామలపై అల్లుడు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ కథనం మేరకు... స్థానిక ఇందిరానగర్‌కు చెందిన కృష్ణారావు, ధనలక్ష్మి దంపతులు చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె మహాలక్ష్మిని విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యానికి ఇచ్చి వివాహం చేశారు. సుబ్రహ్మణ్యానికి, అత్తా, మామలైన ధనలక్ష్మి, కృష్ణారావుకు ఆస్తి విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సుబ్రహ్మణ్యం విజయవాడ నుంచి మరో నలుగురితో కలిసి గూడూరుకు వచ్చారు. ఆస్తి విషయమై మాటామాటా పెరిగి వివాదంగా మారడంతో ధనలక్ష్మి, కృష్ణారావుపై సుబ్రహ్మణ్యం రాడ్డుతో దాడి చేశాడు. కృష్ణారావు, ధనలక్ష్మి తలకు తీవ్ర గాయాలవడంతో వారిని ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: పాశిం

గూడూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొండాగుంట గ్రామంలో పల్లెపండుగ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు అధ్వానంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి మండలంలో రూ.2కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా కొండాగుంట గ్రామంలో రూ. 10లక్షలతో సీసీ, డ్రైనేజీ కాలువల పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నేరవేర్చుతుందని సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, శ్రీనివాసులురెడ్డి, గుండాల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వేలను పరిశీలించిన డీఎస్పీ, తహసీల్దార్



కలవకూరు కాజ్‌వేను పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

పెళ్లకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, పెళ్లకూరు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని కలవకూరు, కప్పగుంటకండ్రిగ సమీపంలోని స్వర్ణముఖినదిపై నిర్మించిన లోలెవల్ కాజ్‌వేలను డీఎస్పీ, తహసీల్దార్ వేర్వేరుగా పరిశీలించారు. వరద ప్రవాహం అధికంగా ఉండే కాజ్‌వేలు, వాగులు, వంకలు ఉన్నచోట ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో అధికారులకు సమాచార అందిస్తే సహాయ చర్యలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, వీఆర్వో వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

వర్షం.. ఆపై ఈదురు గాలులు



దామరాయి వద్ద ఎల్డిషైర్ల వేసిన పొలాల్లో నిలిచిన వర్షపునీరు

సూళ్లూరుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సూళ్లూరుపేటలో సోమవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున ప్రారంభమైన వాన మధ్యాహ్నం 12 గంటల వరకు పడింది. గాండ్లవీధి, సాయినగర్ ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా జీఎన్‌టీ రోడ్డు గుంతలమయంగా మారింది. తీరప్రాంతాలైన కొరిడి, పేర్నాడు, దామరాయి, కడపత్ర, కొనతత్తూరు, తోటకట్ల గ్రామాల్లో ఎల్డిషైర్లు నీటి మునిగాయి. మధ్నాహ్నం నుంచి రాత్రి వరకు ఈదురు గాలులతో కూడిన తేలికపాటి జల్లులతో వర్షం కురిసింది. కొరిడి - పేర్నాడు రోడ్డు, మండల పరిషత్, ఆర్డీవో కార్యాలయాల ప్రాంతం రొచ్చురొచ్చుగా మారాయి.

విద్యార్థులందరికీ హాస్టల్ సీట్లు ఇవ్వాలి

తిరుపతి(విద్య), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నడిచే విద్యాలయాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులందరికీ హాస్టల్ సీట్లు కేటాయించాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హేమాద్రి యాదవ్ కోరారు. ఈ మేరకు జేఏసీ నాయకులు సోమవారం డీఈవోను కలిసి వినతి పత్రం సమర్పించారు. హేమాద్రి మాట్లాడుతూ పేద విద్యార్థులకు కళాశాల సీటు వచ్చినా వసతిగృహంలో రాకపోవడంతో ప్రైవేట్ హాస్టళ్లను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. టీటీడీ విద్యాసంస్థల్లో 60 శాతం విద్యార్థులకు హాస్టల్ సీట్లు కేటాయించాలని, 40 శాతం మాత్రమే డేస్కాలర్స్‌గా భర్తీ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. స్పాట్ అడ్మిషన్స్ ద్వారా ప్రవేశాలు సాధించిన విద్యార్థులకు వసతిగృహం కేటాయించరాదన్న నిర్ణయాన్ని ఖండిస్తున్నామని చెప్పారు.

వేతనాలు సకాలంలో అందేలా చూడండి

తిరుపతి(వైద్యం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు అందేలా చూడాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

లోతట్టు గ్రామాల్లో అధికారుల పర్యటన



రొయ్యల కాలువను పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్ఐ

చిట్టమూరు, అక్టోబర్ 14 (ఆంధజ్యోతి): తుఫాన్ ప్రభావం వల్ల భారీ వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు గ్రామాల్లో మండల అధికారులు సోమవారం పర్యటించారు. తహసీల్దారు ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ చిన్న బలరామయ్య, రీ సర్వే డీటీ నిరంజన్‌కుమార్, ఏఎస్‌వో భాషా మండలంలోని లోతట్టు గ్రామాలను సందర్శించారు. రొయ్యలకాలువ సమీపంలోని పిట్టివానిపల్లి గ్రామస్తులను అప్రమత్తం చేశారు. రొయ్యల కాలువ ప్రవహిస్తే ఆ గ్రామం నీటమునిగి రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామస్తులతో మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు



తూపిలిపాళెం సముద్రతీరం వద్ద తహసీల్దారు, ఎస్ఐ

వాకాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన అల్పపీడనంగా మారి సోమవారం భారీ వర్షాలు కురవడంతో తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఎస్ఐ నాగబాబు మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలో తీర ప్రాంతాలైన దుగరాజపట్నం, కొండూరుపాళెం, అంజలాపురం, తూపిలిపాళెం తదితర తీరప్రాంత గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు పర్యటించి పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజల సౌకర్యార్థం కొండూరుపాళెం, బాలిరెడ్డిపాళెం, ముట్టెంబాక, తూపిలిపాళెం, గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు రామయ్య మాట్లాడుతూ సముద్రంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. ఉరుముల మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉండడంతో పొలాల్లోకి వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలన్నారు.

తీరప్రాంత గ్రామాల పరిశీలన



మత్స్యకారులకు సూచనలిస్తున్న తహసీల్దారు జయజయరావు

కోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో అధికారులు సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని స్వర్ణముఖి నది పరివాహక గ్రామాలైన రుద్రవరం, ఉనుగుంటపాళెం, తిన్నెలపూడి, గూడలి గ్రామాల్లో తహసీల్దారుతో పాటు ఎంపీడీవో వేణు, వివిధ శాఖల అధికారులు పర్యటించారు. లోతట్టు గ్రామాలైన కర్లపూడి, రుద్రవరం, గోవిందపల్లి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. రేషన్ దుకాణాల వద్ద నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచారు.

ముంపు ప్రాంతాల్లో....

దొరవారిసత్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంపు ప్రాంతాల్లో అధికారుల బృందం పర్యటించింది. తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఎస్ఐ అజయ్‌కుమార్, ఇతర శాఖల అధికారులతో కలసి పులికాట్ తీర గ్రామాలైన మీజూరు ప్రాంతంతో పాటు, కాళంగి పరివాహక ప్రాంతాలైన వేటగిరిపాళెం, బురదమడుగు, తల్లంపాడు, వివిఎస్ఆర్ నగర్, తనియాలి గిరిజన కాలనీల్లో పర్యటించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుకు భవనాలను పరిశీలించారు. మూడు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మలేషియన్ అథ్లెటిక్స్‌లో నాయుడుపేటవాసికి బంగారు పతకం



బంగారు పతకాన్ని అందుకుంటున్న వెంకటరావు

నాయుడుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మలేషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కౌలాలంపూర్‌లో జరిగిన 36వ చాంపియన్ షిప్ పోటీల్లో నాయుడుపేట వాసి వెంకటరావుకు బంగారు పతకం లభించింది. నాయుడుపేట మండలంలోని పుదూరు సచివాలయ సెక్రటరీగా పనిచేస్తున్న వెంకటరావు హైజంప్ విభాగంలో బంగారు పతకం సాధించి భారతదేశ త్రివర్ణ పతకాన్ని రెపరెపలాడించారు. పలువురు ఉద్యోగులు వెంకటరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కేంద్రమంత్రిని కలసిన కోమారి

కోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ నాయకుడు కోమారి కోటేశ్వరరావు హైదరాబాదులో కలిశారు. గూడూరు నియోజకవర్గంలో సమస్యలను కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు కోటేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా రాజకీయాలపై కిషన్‌రెడ్డితో చర్చించినట్లు చెప్పారు.



గ్రామీణాభివృద్ధి కోసమే పంచాయతీ వారోత్సవాలు



సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో కోటేశ్వరరావు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి కోసమే పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పెట్లూరు, పంజాం, మొగళ్లగుంట పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి రూ.2కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

రూ.10నాణేల ఆమోదంపై ప్రచారం

తిరుపతి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రూ.10 నాణేల ఆమోదంపై కెనరా బ్యాంకు సర్కిల్ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ప్రచారం నిర్వహించారు. దీనికి సంబంధించిన ప్రచార వాహనాన్ని బ్యాంకు జీఎం పాండురంగ మిథంతాయా ప్రారంభించారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన కస్టమర్లకు నాణేలను పంపిణీ చేశారు. ఎలాంటి సందేహమూ లేకుండా నాణేలను చలామణి చేసుకోవాలని కోరారు. డీజీఎం జి.ఎన్. మూర్తి, రీజనల్ హెడ్ టి.నాగరాజు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు సర్కిల్, రీజినల్ ఆఫీస్ సిబ్బంది, ఫీల్డ్ స్టాఫ్స్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు, సిబ్బంది

టీడీపీ నేత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



చాన్‌బాషా మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ తండ్రి చాన్‌బాషా(62) ఆదివారం మృతి చెందారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సోమవారం రఫీ నివాసానికి చేరుకొని చాన్‌బాషా మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తుఫాన్ ప్రభావంపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

సూళ్లూరుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులందరూ అప్రమత్తగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు సూళ్లూరుపేట ప్రాంతంపై తుఫాన్ ప్రభావం అధికంగా ఉండవచ్చునని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందని, అధికారులు అందుబాటులో ఉండి గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. తీరప్రాంత గ్రామాల్లో ప్రజలతో పాటు లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఇందుకోసం రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



భీములవారిపాళెం పడవలరేవును పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎంపీడీవో

తడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం తడకు వచ్చిన ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో తుఫాన్ ప్రభావంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే ఆస్కారం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల న్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని ఆదేశించారు. ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. అంతకుముందు భీములవారిపాళెం పడవలరేవులో తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో విజయ్‌కుమార్ పర్యటించి మత్స్యకారులను వేటకు వెళ్లవద్దని సూచించారు. సమావేశంలో వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో మోస్తరు వర్షం

వెంకటగిరి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగళాఖతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వెంకటగిరిలో సోమవారం మోస్తరు వర్షం పడింది. తెల్లవారు జామున 4గంటల నుంచి వర్షం కురిసింది.

దొరవారిసత్రంలో ముసురు

దొరవారిసత్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో రోజంతా ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం 40.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా, సాయంత్రం వరకు చిన్నపాటి చిరుజల్లులతో ముసురు నెలకొంది.